

జిల్లా కేంద్రం నల్ల మైదానంలో రెండు రోజుల పాటు అయిదో జాతీయ జూనియర్ లగోరి పోటీలు నిర్వహించారు. విజేతగా నిలిచిన తెలంగాణ బాలుర జట్టుకు బహుమతి అందిస్తున్న భాజపా రాష్ట్ర కార్యదర్శి నర్సింగరావు

న్యూస్‌టుడే, వికారాబాద్

ఈనాడు
వికారాబాద్

సోమవారం 21 ఆగస్టు 2017 — 16 పేజీలు

రాయితీకి.. తిలోదకాలు!

కూరగాయల సాగుకు జిల్లా ప్రసిద్ధి చెందింది. ఇక్కడి రైతులు రకరకాల కూరగాయలు పండిస్తూ వివిధ ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఉదయాన్నే కూతవేటు దూరంలో భాగ్యనగరానికి వాహనాలు బారులు తీరుతాయి. అయితే రైతులకు ప్రభుత్వం నుంచి సరైన సహకారం అందడంలేదు. తోటల సాగుకు రాయితీ విత్తనాలు అందకపోవడంతో అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది ఈ విత్తనాల సరఫరా నిలిపివేశారు. ఫలితంగా బహిరంగ మార్కెట్‌లో విత్తనాలకు అధిక ధరలు చెల్లిస్తూ, నకిలీలతో ఉద్యాన రైతులు నష్టపోతున్నారు.





వంకాయ తోట, మిరప తోట

రైతులకు అందడం లేదు



సుభాన్‌రెడ్డి, ఎర్రవల్లి

రాయితీ విత్తనాలు అందడం లేదు. వస్తాయో రావో కూడా తెలీదు. సమయానికి అందక ఇబ్బంది అవుతోంది. ఇస్తే ఇస్తాం లేదంటే లేదని చెప్పడం లేదు. దీంతో బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేయటం వల్ల అధిక ధరలు చెల్లిస్తున్నాం. పెట్టుబడులు పెరుగుతున్నాయి. పంట వల్ల లాభం ఉండటం లేదు.

• రైతుకు చేరని విత్తనాలు • అందని సర్కారు సాయం • ఉసూరుమంటున్న ఉద్యాన శాఖ

వికారాబాద్:

జిల్లాలో సుమారు 25 వేల హెక్టార్లలో కూరగాయ పంటలు సాగు చేస్తున్నారు. ప్రధానంగా టమాటా, వంగ, బెండ, ఉల్లి, క్యాబేజీ, క్యారెట్, క్యాలీఫ్లవర్, కాకర, ఇతర తీగజాతి కూరగాయలు పండిస్తున్నారు. ఈ పంటలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఏటా రాష్ట్రీయ కృషి వికాస యోజన (ఆర్‌కేవీవై) పథకంలో మేలు రకం, నాణ్యమైన విత్తనాలు, నారును అందిస్తున్నారు. ఈ బాధ్యతలను ఉద్యాన శాఖ తీసుకుంది. మల్చింగ్ షీట్స్, శాశ్వత పందిళ్ల ఏర్పాటు, సాగుకు అవసరమైన మినీ కిట్స్‌ను రాయితీలతో అందించాలని ప్రభుత్వ లక్ష్యం. దీనికి సంబంధించి జిల్లా నుంచి ఈ ఏడాది సీజన్‌కు ముందే అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. అయితే సీజన్ దాటిపోతున్నా, రాయితీ విత్తనాలు, మేలు జాతి వంగడాల నారును అందిస్తారనుకున్న ఉద్యాన శాఖాధికారులు చేతులెత్తేశారు.

ప్రైవేట్‌గా కొనుగోలు చేస్తూ: ఈ పరిణామంతో ప్రైవేటు దుకాణాల్లో కూరగాయ విత్తనాలు కొనుగోలు చేస్తూ, నకిలీల బెడదతో రైతులు అవస్థలు పడుతున్నారు. నిధులొస్తాయి.. రైతుకు

మిగతా 7 లో...

అక్రమార్కుల గుండెల్లో దడ!

- అధికారుల కదలికతో ప్రభుత్వ గని భూములకు రక్షణ
- నిక్షేపాల దోపిడీకి అడ్డుకట్ట
- జరిమానాలతో సమకూరనున్న ఆదాయం



ఇటీవల ఏడీ తనిఖీతో ప్రభుత్వ భూముల్లో నిలిచిన తవ్వకాలు

న్యూస్‌టుడే, తాండూరుగ్రామీణ

ఎట్టకేలకు ప్రభుత్వ భూముల్లో తవ్వకాలపై అధికారులు దృష్టి సారించారు. విలువైన నిక్షేపాల తరలింపును కట్టడి చేసేందుకు రంగంలోకి దిగారు. అధికారుల చర్యలతో అక్రమార్కుల్లో దడపుట్టేలా చేశారు. నిన్నటిదాకా ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టవేసిన ఉపపాలనాధికారి సందీప్‌కుమార్ తాజాగా నాపరాయి అక్రమ తవ్వకాలపై దృష్టి సారించారు. బషీరాబాద్ మండలంలో పెద్దఎత్తున అక్రమ గనులపై చర్యలకు ఉపక్రమించిన ఉపపాలనాధికారి తాజాగా మిగిలిన వాటి విషయంలో ఇదే విధంగా వ్యవహరిస్తారని చర్చలు జోరందుకున్నాయి. అధికారులు తీసుకుంటున్న చర్యలతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరనుంది.

తాండూరు నాపరాయికి దేశంతోపాటు విదేశాల్లోను మంచి గిరాకీ ఉంది. ఈక్రమంలో కొందరు అనుమతులు పొందకుండా అడ్డదారిలో విలువైన నిక్షేపాల తవ్వకాలకు పాల్పడుతున్నారు. నిబంధనల ప్రకారం గనుల శాఖకు చెల్లించాల్సిన సుంకానికి ఎగనామం పెడుతూ, కార్యకలాపాలు సాగిస్తున్నారు. అంతటితోఆగక కొందరు ఏకంగా ప్రభుత్వ భూముల్లోనే ఏళ్లతరబడి పాగావేసి తవ్వకాలు కొనసాగిస్తున్నారు. తవ్విన నిక్షేపాలను దర్జాగా సరిహద్దులు దాటిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా అక్రమ తవ్వకాలతో అనతికాలంలో ఉన్నఫలానా రూ.కోట్లకు పడగలెత్తుతున్నారు. సమాజంలో ఆర్థిక

మిగతా 7 లో...

సేద్యపు కుంటలే రక్ష!

కారు మబ్బులు కటిక చీకట్లను తలపిస్తున్నాయి. వరుణుడు కరుణిస్తే సాగు సవ్యంగా సాగుతుందని, చేను చిగురిస్తే ఆరుగాలం శ్రమకు ఫలితం లభిస్తుందని రైతులు ఆశగా ఆకాశంవైపు ఎదురు చూస్తున్నారు. అయినా వారికి నిరాశే ఎదురవుతోంది. చినుకు రాలదు.. సాగు సాగదన్నట్లుగా పరిస్థితి నెలకొంది. జిల్లాలో సుమారు 73 శాతం లోటు వర్షపాతం నమోదయింది. ఈ పరిణామాలు కరవుకు స్వాగతం పలుకుతున్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది. ఖరీఫ్ సీజన్ తొలినాళ్లలో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసినప్పటికీ ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. ఇటువంటి వర్షాభావ పరిస్థితుల్లో చేనుకు నీటి తడులు అందించేందుకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో సేద్యపు కుంటల నిర్మాణాన్ని ప్రోత్సహించింది. అయితే వీటిపై జిల్లా రైతులు ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. సేద్యపు కుంటలు తవ్వుకుంటే భవిష్యత్తుకు భరోసా ఉంటుందని వ్యవసాయ నిపుణులు పేర్కొంటున్నారు.



రైతులు ముందుకు వస్తే మేలు • జిల్లాలో వర్షాభావ పరిస్థితులు

వికారాబాద్:

జిల్లాలో సుమారు 1.76 లక్షల హెక్టార్లలో సాగు భూములు ఉన్నాయి. ప్రతి రైతు తన పొలంలో సేద్యపు కుంటలు తవ్వుకునేందుకు ముందుకొస్తే ఉపాధి హామీలో ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. గుంతల తవ్వకంలో 20×20, 12×12, 9.5×9.5, 8×8, 6×6 (మీటర్లలో) రకాల కొలతలను సూచిస్తున్నారు. భూమి విస్తీర్ణం ఆధారంగా ఏ కొలతలు కలిగిన సేద్యపు కుంటలు తవ్వుకోవాలనేది ఉపాధి సిబ్బంది రైతులకు సలహాలు, సూచనలు అందిస్తారు. దీని ప్రకారం

మిగతా 7 లో...



సిమెంటు రహదారిపై కూరగాయల విక్రయాలు

తాజా కూరలు.. రహదారిపైనే విక్రయాలు!

★ రైతు బజారు నిర్మిస్తే అన్నదాతలకు ఊరట ★ కొనుగోలుదారులకు తప్పనున్న వెతలు

న్యూస్‌టుడే, తాండూరుగ్రామీణ

విత్తనాలు వేయడం దగ్గర్నుంచి దిగుబడులు చేతికొచ్చేంత వరకు అన్నదాతలు పొలాల్లో స్వేదం చిందిస్తున్నారు. చివరకు పంట దిగుబడులను విక్రయించేందుకూ చమటోడ్చాల్సి వస్తోంది. వెరసి తాజా కూరలు అమ్మకానికి తెచ్చిన పదులసంఖ్యలో రైతులకు..కొనుగోలు చేసేందుకు వచ్చే వందల సంఖ్యలో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. తాండూరు నియోజకవర్గంలో అత్యధిక జనాభా ఉన్న కరణ్‌కోటలో ప్రతి ఆదివారం నిర్వహించే సంతలో అసౌకర్యాలతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

తాండూరు మండలం కరణ్‌కోటలో మూడు వేలకుపైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. 10వేలకుపైగా జనాభా ఉన్నారు. పద్నాలుగు వార్డులు కొనసాగుతుండగా ఏకంగా ముగ్గురు ఎంపీటీసీ సభ్యులు గ్రామానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గ్రామంలో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో కొనసాగుతున్న ఆసియా ఖండంలోనే రెండో అతిపెద్ద సిమెంటు కర్మాగారం సిమెంటు కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ), పదులసంఖ్యలో నాపరాయి గనులు ఉన్నాయి. వీటిలో పనిచేసేందుకు గ్రామస్థులతోపాటు ఇతర జిల్లాలవారు, పొరుగున్న కర్ణాటక, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వందలమంది ఉపాధి, ఉద్యోగాల నిమిత్తం వచ్చి నివసిస్తున్నారు. వేలసంఖ్యలో జనాభా నివసిస్తున్న గ్రామంలో ప్రతి ఆదివారం సంత నిర్వహిస్తున్నారు. సంతలో ఎక్కువశాతం కూరగాయల విక్రయాలు జరుగుతుంటాయి. చాలామంది గ్రామస్థులు ఇతర సామగ్రిని పట్టణంలో కొనుగోలు చేస్తున్నప్పటికీ కూరగాయలు మాత్రం గ్రామంలోని సంతలో విక్రయాలపైనే ఆధారపడుతున్నారు. ప్రధాన కారణమేమంటే ఇక్కడి సంతలో కూరగాయలను స్వయంగా పండించిన రైతులే నేరుగా పొలాల నుంచి తెచ్చి విక్రయిస్తుండటం.

ఐదు గ్రామాలకు చెందిన..

కరణ్‌కోట సంతలో కరణ్‌కోట, చంద్రవంచ, చిట్టిగణాపూర్, బెల్కటూరు, గుంతబాస్పల్లి, గోపన్‌పల్లి గ్రామాలకు చెందిన పదులసంఖ్యలో రైతులు కూరగాయలు విక్రయిస్తారు. వీరంతా ఆయాగ్రామాల్లోని పొలాల్లో కూరగాయ పంటలను పండిస్తున్నారు. చాలామంది రైతులు కంది, పత్తి, వరి వంటి పంటలను సాగు చేస్తుండగా కొంతమంది రైతులు మాత్రం అందుకు భిన్నంగా రోజు ఆదాయం వచ్చే కూరగాయల సాగుపై దృష్టి సారించారు. టమాటా, పచ్చిమిరప, వంకాయ, చిక్కుడు, చౌడకాయ, బెండ, కాకర, బీరకాయలతోపాటు ఆకుకూరలైన పాలకూర, తోటకూర, చుక్కకూర, పూదీన, కొత్తిమీర, మెంతి, సోయికూరలను పండిస్తున్నారు. కూరగాయలను ఎప్పటికప్పుడు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తెంపుతున్నారు. ప్రతిఆదివారం నేరుగా కరణ్‌కోట సంతకు తరలిస్తున్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6గంటల వరకు అక్కడే కూర్చొని కూరగాయలు నేరుగా ప్రజలకు విక్రయిస్తున్నారు. దీంతో దళారుల బెడద లేకుండా నేరుగా వినియోగదారులకు అమ్ముతుండటంతో రైతులతోపాటు కొనుగోలుదారులకు లాభదాయకంగా ఉంటోంది. రైతులు పొలాలనుంచి ఒకటిరెండుగంటల్లో సంతకు తరలించి విక్రయిస్తుండడంతో తాజా కూరలను ప్రజలు ఉత్సాహంగా కొనుగోలు చేస్తున్నారు.



చంద్రవంచలో బీరకాయలు తెంపుతున్న మహిళా రైతులు

సంతలో వసతులు లేక...

వందలసంఖ్యలో ప్రజలు వచ్చిపోయే సంతలో కనీస సౌకర్యాలు లేవు. బజారు ప్రాంతం నుంచి నాలుగు వీధులకు వెళ్లే సిమెంటు రహదారులపైనే ఐదుగ్రామాలకు చెందిన రైతులు కూరగాయల విక్రయాలు కొనసాగిస్తున్నారు. దీంతో నాపరాయి ప్రాంతం కావడంతో వేసవిలో 40డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతల సమయంలో ఎండబారి నుంచి తప్పించుకునేందుకు గొడుగు కింద కూర్చోవాల్సి వస్తోంది. ప్రస్తుతం వర్షాకాలంలో విక్రయాలకు అవస్థలు తప్పడంలేదు. సిమెంటు రహదారిపై ఉంచి కూరలు విక్రయించాల్సి రావడం ఇబ్బందిగా మారింది. వందలసంఖ్యలో ప్రజలు కూరలు కొనేందుకు వస్తుండగా కనీసం తాగునీటి నల్లాలుసైతం అందుబాటులో లేవు. నాలుగువైపులా సిమెంటు రహదారుల మార్గం కావడంతో రాకపోకలకు వీలు ఉండడంలేదు.

సంత(తైబజారు) వేలంపాట ద్వారా ఏటా పంచాయతీకి రూ.30వేల నుంచి రూ.50వేల దాకా ఆదాయం సమకూరుతోంది. పంచాయతీ పాలకవర్గం, అధికారులు దృష్టి సారించి కూరగాయల విక్రయించే సంతకు ప్రత్యేకంగా స్థలం కేటాయించడం, రైతు బజారు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, కూరగాయలు విక్రయించే ఐదారుగ్రామాల రైతులు కోరుతున్నారు. పంచాయతీ ఆదాయంసైతం రెట్టింపయ్యే ఆస్కారముంటుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారిలో కూరల అమ్మకం



కర్రల సాయంతో కాకర సాగు..

ఒకచోట పడితే.. ఒకచోట పడదు!

☛ వరుణుడి దోబూచులాటతో రైతన్నలు దిగులు

దోమ, న్యూస్‌టుడే: ప్రజల మధ్యే తేడాలు దేవుడి దృష్టిలో అందరూ సమానమంటారు. కానీ వరుణుడు కూడా తేడాలు చూపిస్తున్నాడని అన్నదాతలు వాపోతున్నారు. ఒకచోట పడితే ఒక చోట వర్షం ఉండటం లేదు. ఎండ కాస్తోంది. దీంతో వానచుక్క కోసం పంటలు ఎదరుచూడాల్సి వస్తోంది. ఉదాహరణకు.. .పరిగి మండలంలో ఇటీవల వాన దేవుడు కరుణించి ఓ మోస్తరు వర్షం కురిసింది. మెట్ట పైర్ల (పత్తి, మొక్కజొన్న, జొన్న)కు తడంది కళకళాడుతున్నాయి. పైర్లకు జీవం పోసినట్లైందని ఈ ప్రాంత రైతులు సంతోషిస్తున్నారు. అదేవిధంగా దోమ మండలంలోని శివారెడ్డిపల్లి, బొంపల్లి వరకు వర్షం పడింది. ఫలితంగా ఈ రెండు గ్రామాల రైతులకు కొంత ఊరట కల్గింది. మిగతా గ్రామాల్లో చినుకు రాలలేదు. పొట్టతో ఉన్న మొక్కజొన్న పైర్లు అదిరిపోతున్నాయి. అదే వర్షం పడిఉంటే గింజలు పోసుకుని కనీసం 60 శాతం మేలు కలిగేదని మిగతా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేగడి..అందుతుంది తడి...

పరిగిలో నల్లరేగడి నేలలు అధికంగా ఉన్నాయి. దీంతో పైరులో కలుపు మొక్కలు అంతగా ఉండవు. ఒక్కసారి కలుపు తీస్తే చాలు పైంట కోసే వరకు ఇబ్బంది ఉండదు. ఫలితంగా కొద్దిపాటి వర్షం పడినా దంట్లూ నేలను తడి పట్టుకుని ఉంటాయి. తడి అంటి ఉండడంతో మొక్క కళకళలాడుతుంది. ఒక్కసారి చినుకు రాలితే చాలు పక్షం రోజుల వరకు జీవం పోసుకుంటుంది. అదే చెలుకనేలల్లో వరద పారే వర్షం పడినా 3,4 రోజులకు మించి తడి ఉండదు. అందులో ఇక్కడి పొలాల్లో కలుపు విపరీతంగా వస్తుంది. కలుపుతీసినా, మందులు పిచికారి చేసినా దంటూ ఎదిగాక క్రమంగా కలుపు పెరుగుతుంది. ఇలాంటి కరవు పరిస్థితిలో అడపాదడపా కురిసే చినుకులను కలుపు మింగేస్తుంది. ఫలితంగా పైరు అదురుతోంది. దీంతో వాతవరణం ఎప్పుడు అనుకూలిస్తేనే పంటలు పండుతాయి. వర్షాకాలంలో వర్షాలు అంతటా ఒకే మాదిరి పడేది. కానీ ఇటీవల కాలంలో ఎక్కడ పడితే అక్కడే వర్షం మిగతా ప్రాంతాల్లో వర్షం జాడ ఉండడంలేదు. దీంతో ఈ తేడా ప్రాంతాల మధ్య ప్రభావం చూపిస్తుంది. పైర్ల ఎదుగుదలపై ప్రభావం చూపిస్తోందని పలువురు రైతులు వాపోతున్నారు.



లక్ష్మీదేవి పల్లిలో మొక్కజొన్న సాగు



నీరులేక వాడిపోతున్న మొక్కజొన్న

పేదల ప్రయోజనాలు పరిరక్షించేందుకు కృషి : ఎంపీ కేకే


బంజారాహిల్స్, న్యూస్‌టుడే: పేద ప్రజల ప్రయోజనాలను పరిరక్షించేందుకు తెరాస ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఎంపీ (రాజ్యసభ) కె. కేశవరావు అన్నారు. బంజారాహిల్స్ డివిజన్‌లోని రూ.వందల కోట్ల విలువైన 15 ఎకరాల భూమిపై, రాష్ట్ర ప్రభుత్వానికి, ఇతరులకు మధ్య ఉన్న వివాదం పరిష్కారమై ఆ భూమి ప్రభుత్వానికే చెందుతుందని తేలడంతో ఆయా బస్తీల ప్రజలు ఆదివారం ఎంపీ కేకేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మూడు దశాబ్దాలుగా ఈ స్థలం వివాదం ప్రభుత్వానికి, ఇతరులకు నడుమ న్యాయస్థానంలో నడుస్తోంది. ఈ ప్రాంతంలో నివసిస్తున్న స్థానికులు, తమ నివాసాల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు పెట్టుకున్నా న్యాయపరమైన చిక్కులు వచ్చేవి. ఈ నేపథ్యంలో 2015లో ఎన్‌బీటీనగర్ బస్తీకి వచ్చిన సీఎం కేసీఆర్‌కు స్థానికులు ఈ విషయం వివరించారు. అప్పటి నుంచి ప్రభుత్వ ప్రతినిధులు న్యాయస్థానంలో ప్రభుత్వం తరఫున గట్టిగా వాదనలు వినిపించారు. తీర్పు ప్రభుత్వ పక్షాన వచ్చినట్లు తెలియడంతో స్థానికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్, ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, మంత్రి కేటీఆర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ, గత ప్రభుత్వాలు నెరవేర్చలేని పనిని, తెరాస ప్రభుత్వం చేసి చూపించిదని చెప్పారు. కృతజ్ఞతలు తెలిపిన వారిలో తెరాస నేతలు సీహెచ్ రవికుమార్, శ్రీనివాసగౌడ్, సుభాష్, రణవీర్, రాజు, పెద్దసంఖ్యలో బస్తీ ప్రజలు ఉన్నారు.

భర్త తాగుడు మానకపోవడంతో తనువు చాలించిన భార్య

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: ఎన్నిసార్లు చెప్పినా భర్త పద్ధతి మార్చుకోవడం లేదని ఓ భార్య తనువు చాలించింది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్డు నం. 10సిలోని ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం లింగంగుట్ట గ్రామానికి చెందిన వారికంటి రామిరెడ్డి, గోవర్ధిని(25) ఉంటున్నారు. రామిరెడ్డి మేస్త్రీగా పనిచేస్తుండగా గోవర్ధిని చిన్నచిన్న పనులు చేసుకుంటూ పిల్లలను చూసుకొనే వారు. రామిరెడ్డి మద్యానికి అలవాటుపడటంతో మద్యం మానేయాలని గోవర్ధిని చాలాసార్లు కోరింది. ఇంటి గురించి, పిల్లల గురించి పట్టించుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటూ నిత్యం కోరేది. భార్య మాటను పెడచెవిన పెట్టిన రామిరెడ్డి శనివారం రాత్రి కూడా మద్యం తాగి ఇంటికి వచ్చారు. ఇద్దరి మధ్య గొడవ జరిగింది. కొద్ది సేపటి తరువాత లోపలి గదిలోకి వెళ్లిన ఆమె ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. భర్త గుర్తించే సమయానికే ఆమె ప్రాణం విడిచింది. తన తాగుడే తన భార్య ప్రాణాలు తీసిందని, తాగుడు మానుకోవాలని, కుటుంబాన్ని చూసుకోవాలంటూ చెప్పినా వినలేదని ఈ కారణంగానే మనస్తాపంతో చనిపోయిందంటూ రామిరెడ్డి పోలీసులకు వివరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్భాటమే... అర్బన్ పాఠశాలలేవీ...!

న్యూస్‌టుడే, కొడంగల్



వరంగల్ జిల్లాలో ప్రచురించిన ప్రవేశ కరపత్రం

ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన అర్బన్ పాఠశాలు కనుమరుగయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాకు ఒక అర్బన్ పాఠశాలను ప్రభుత్వం కేటాయించింది. రాష్ట్ర వ్యాప్తంవగా దాదాపు అన్ని జిల్లాల్లో ప్రారంభించినా కేవలం వికారాబాద్ జిల్లాలో మాత్రం నేటికీ ప్రారంభం కాలేదు. రెండు నెలల క్రితం అర్బన్ పాఠశాలలు ప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అందుకు సంబంధించిన నియామకాలను మండల విద్యా వనరుల కేంద్రంలో విధులు నిర్వహించే సీఆర్‌పీల ద్వారా భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. గత జూన్ 22న అర్బన్ పాఠశాలలకు సంబంధించి పరీక్షలు నిర్వహించి జులై 6న ఫలితాలను విడుదల చేసింది. ఈ ఫలితాలు వెలువడిన వెంటనే పాఠశాలలు ప్రారంభించాల్సి ఉండగా కేవలం వికారాబాద్ జిల్లాలోనే అర్బన్ పాఠశాలలను ప్రారంభించలేదు.



మహబూబ్‌నగర్‌లో కొనసాగుతున్న అర్బన్ పాఠశాల

బడిబయట పిల్లలను పాఠశాలలో చేర్పించాలని....

కస్తూర్బా పాఠశాలలో బాలికలకు విద్యను అందిస్తున్నట్లుగానే బడిబయట ఉన్న బాలురకు విద్యను అందించాలనే ఉద్దేశంతో అర్బన్ పాఠశాలల ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. కస్తూర్బా పాఠశాల మాదిరి మండలానికి ఒక పాఠశాలకాకుండా జిల్లాకు ఒక పాఠశాలను కేటాయించారు. జిల్లా కేంద్రంలో ఈ పాఠశాల నిర్వహణ కార్యక్రమం ప్రారంభించాలని ఆదేశాలను జారీ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మహబూబ్‌నగర్, వరంగల్‌తో పాటు దాదాపు అన్ని జిల్లా కేంద్రాల్లో పాఠశాలలు ప్రారంభించి తరగతులు నిర్వహిస్తున్నారు.

ప్రైవేటుకు దీటుగానే అన్ని వసతులు

ప్రైవేటు పాఠశాలలకు, వసతి గృహాలకు దీటుగా వీటిని నిర్వహించాలని ప్రభుత్వ లక్ష్యం నిర్దేశించుకొంది. అందులో భాగంగానే బడిబయల ఉన్న పిల్లలను 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు బడిలో చేర్చుకొని వారికి వారానికి 5 గుడ్లు, ఉచితపుస్తకాలు, ఉచితంగా దుస్తులు, అల్పాహారం, పాలు, స్నాక్స్, శనివారం వెజిటబుల్స్, ఆదివారం చికెన్, బెడ్‌షీట్స్, ట్రంకుపెట్టెలు, బూట్లు, వైద్య పరీక్షలు, ఆటవస్తువులు, నాణ్యమైన విద్యాబోధన అందించనున్నారు.

ఆరు నెలలైనా ప్రారంభంకాలే..

అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ప్రారంభించి దాదాపు మూడు నెలలు గడుస్తున్నా నేటికీ అర్బన్ పాఠశాలలు ప్రారంభంకాలేదు. మరో నెలరోజుల్లో అర్ధ వార్షిక పరీక్షలు ప్రారంభంకానున్నాయి. పాఠశాలకు సంబంధించి ఓ ప్రైవేటు స్వచ్ఛంద సంస్థ బడిబయట ఉన్న పిల్లలను సైతం గుర్తించి నెలలు గడుస్తున్నా కేవలం పాఠశాలకు స్థలం లేదనే ఉద్దేశంతో ప్రారంభం కావడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా పాఠశాలలు ప్రారంభిస్తే కొంత వరకు విద్యార్థులకు మేలు జరుగుతుంది. ఇతర జిల్లాలో ప్రారంభించడానికి ఏకంగా కరపత్రాలను ప్రచురించి విద్యార్థులను చైతన్యం చేస్తుంది. వికారాబాద్ జిల్లాలో విద్యార్థులు సిద్ధంగా ఉన్నా పాఠశాలలు ప్రారంభకావడంలేదని పలువురు తల్లిదండ్రులు తెలిపారు.

ఫలితాలు వెలువడి నెలరోజులు

ఆర్బన్ పాఠశాలల నిర్వహణకు సంబంధించి ప్రతి సబ్జెకుకు ఒకరిని ఎంపిక చేశారు. ఇందులో కొడంగల్, బొంరాస్‌పేట, కుల్కచర్ల, మోమిన్‌పేటలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన సీఆర్‌పీలు ఎంపికయ్యారు. వారుకూడా నెలలరోజులగా ఎదురుచూస్తున్నా నేటికీ పాఠశాలలు ప్రారంభం కావడంలేదని అంటున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ కసరత్తుచేసి పాఠశాలలను ప్రారంభించాలని కోరుతున్నారు.

త్వరలోనే ప్రారంభిస్తాం: డీఈఓ దీపిక

జిల్లాకు కేటాయించిన అర్బన్ పాఠశాలలను త్వరలోనే ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. విద్యార్థుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు ఉండేలా చూస్తాం. తల్లిదండ్రులు కూడా సహకరించాలి.

'సమన్వయంతో భాజపాకు విజయం'

సైదాబాద్: పరస్పర అవగాహన, చక్కటి సమన్వయ-సహకారాలతో తెలంగాణలో భాజపా అత్యద్భుతంగా విజయాలు సాధించేందుకు యువత ముందుభాగంలో ఉండాలని బీజేవైఎం జాతీయ కార్యదర్శి బద్దం మహిపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ప్రజలు సంపూర్ణ ఆత్మవిశ్వాసంతో ఉన్నారని, రెండోదఫా విజయానికి సామాజిక మాధ్యమాల సహకారంతో మరింత కృషి చేయాలని వివరించారు. సైదాబాద్ డివిజన్ ఎస్బీహెచ్ గడ్డిఅన్నారం -1 కాలనీలోని పద్మావతి కల్యాణ మండపంలో ఆదివారం మధ్యాహ్నం బీజేవైఎం మలక్‌పేట నియోజకవర్గం కమిటీ ఇన్‌ఛార్జి జి. మురళి ఆధ్వర్యంలో ఏర్పాటైన సామాజిక మాధ్యమాల (సోషల్ మీడియా) కార్యశాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సామాజిక మాధ్యమాల విశ్లేషకుడు చంద్రశేఖర్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. మూడున్నరేళ్ల మోదీ పాలనపై ప్రజలు ఆదరాభిమానాలు చూపుతున్నారని చెబుతూ.. సామాజిక మాధ్యమాల ద్వారా కేంద్రం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారాలు చేయాలని సూచించారు. భాజపా మలక్‌పేట నియోజకవర్గం కన్వీనర్ సంరెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. భాజపాలో నూతనోత్సాహన్ని జాతీయాధ్యక్షుడు అమిత్‌షా నింపుతున్నారని వివరించారు.

'రామ మందిర్ నిర్మాణానికి పార్లమెంట్‌లో చట్టం చేయాలి'



మాట్లాడుతున్న ప్రవీణ్‌భాయ్ తొగాడియా

కాచిగూడ, న్యూస్‌టుడే: అయోధ్యలో రామ మందిర్ నిర్మాణం కోసం పార్లమెంట్‌లో చట్టం చేయాలని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) అంతర్జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రవీణ్‌భాయ్ తొగాడియా కోరారు. అయోధ్య వివాదం ఆలయానికి సంబంధించిన విషయం కాదని, రాముడి జన్మభూమికి సంబంధించిన అంశమని అన్నారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని కాచిగూడలోని మున్నూరు కాపు సంఘం హాలులో జరిగిన భజరంగ్‌దళ్ శక్తి సమ్మేళనం కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ సోమ్‌నాథ్ ఆలయాన్ని నిర్మించి మహమ్మద్ గజినీ దురాక్రమణ మచ్చను చెరిపివేశారని, అయోధ్యలో రామజన్మభూమి ఆలయాన్ని నిర్మించి బాబర్ దురాక్రమణ మచ్చను చెరిపివేయాలన్నారు. డిసెంబరు 6న అయోధ్యలో బాబ్రీ మసీదును నాలుగున్నర గంటల్లో కూల్చేసి ఒక మచ్చను తొలగించారని అన్నారు. రామజన్మభూమి విచారణ అంశం ఇప్పటికే సుప్రీం కోర్టు విచారణలో ఎంతో జాప్యం జరిగిందని, ఫుల్ బెంచీ విచారణ పూర్తి కావడానికి ఐదు దశాబ్దాల సమయం పడుతుందని, అంత సుదీర్ఘకాలం హిందువులు ఉపేక్షించలేరని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని దీన్ని వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ కార్యకర్తలు అడ్డుకోవాలని కాచిగూడ ఘన్‌శ్యామ్ భవన్‌లో జరిగిన భజరంగ్‌దళ్ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో ప్రవీణ్‌భాయ్ తొగాడియా సూచించారు. ఇది ముస్లింల సంక్షేమం కోసం చేపడుతున్న చర్యకాదని, వారి ఓటు బ్యాంకు కోసం చేస్తున్న అనైతిక చర్య అని విమర్శించారు. సమావేశంలో వీహెచ్‌పీ అంతర్జాతీయ అధ్యక్షుడు రాఘవరెడ్డి, భజరంగ్‌దళ్ అంతర్జాతీయ సంయోజక్ మనోజ్‌శర్మ, సోలంకీ సోనాల్, బాలస్వామి, రామరాజు, సురేందర్‌రెడ్డి, భానుప్రకాశ్, సుభాష్‌చందర్ తదితరులు పాల్గొన్నారు.

కేరవెళ్లిలో ఉర్సు ఉత్సవాలు



కేరవెళ్లిలో ఊరేగింపులో సర్పంచి తదితరులు

పూడూరు, న్యూస్‌టుడే): మండల పరిధిలోని కేరవెళ్లిలో ఖాజా బందెనవాబు ఉర్సు ఉత్సవాలను ఆధివారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక సర్పంచి మధుసూదన్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులతో కలిసి గ్రామం నుంచి దర్గావరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గంధం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ గ్రామాల్లో పండుగలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని చెప్పారు. కుల, మత విభేదాలు లేకుండా అందరూ ఐక్యతగా కదిలి రావటం సంతోషాన్ని కలిగించిందన్నారు. కార్యక్రమంలో స్థానికులు నర్సిములు, శ్రీనివాస్, ఖాజా తదితరులున్నారు.

బాలికలు కరాటే విద్యలో రాణించాలి



ముస్సిపల్ ఛైర్‌పర్సన్‌తో కరాటే విద్యార్థులు

తాండూరు, న్యూస్‌టుడే: బాలికలు కరాటే విద్యలో రాణించాలని తాండూరు మున్సిపల్ అధ్యక్షురాలు సునీత అన్నారు. తాండూరు పట్టణం తులసీగార్డెన్‌లో ఆదివారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆమె కలర్‌బెల్టులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరాటే విద్య ఆత్మ రక్షణ కోసం ఎంతో అవసరమని తెలిపారు. ముఖ్యంగా బాలికలు కరాటే విద్యలో మరింత రాణించేలా సాధన చేయాలని పేర్కొన్నారు. కరాటే నేర్చుకున్న బాలికలు మిగిలిన బాలికలకు ఆదర్శంగా నిలవాలని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షులు కె.పి. హన్మంతు, సంయుక్త కార్యదర్శి సుధీర్ బెల్టు పరీక్షలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో తైక్వాండో ప్రతినిధులు జె.నర్సింలు, పి.రాజు, అన్వార్, సురేష్‌గౌడ్, అప్సర్‌ఖాన్, రాము, ఆర్.రాజు, రాము, ప్రియాంక, దీపశ్రీ, ఖలీల్ పాల్గొన్నారు.

ఘనంగా గంగామాత ఉత్సవం



నీటిలో తొట్టెలను విడుస్తున్న మహిళలు

పెద్దేముల్, న్యూస్‌టుడే: మండల కేంద్రం పెద్దేముల్‌లో ఆదివారం గంగామాత జాతరను రజకులు ఘనంగా నిర్వహించారు. గ్రామ సమీపంలోని వాగు వద్ద కులదైవమైన మడలయ్యకు పూజలు నిర్వహించారు. తొలుత మహిళలు ప్రత్యేకంగా తయారు చేసిన తొట్టెలతో గ్రామంలో ఊరేగింపు చేపట్టి వాగు వద్ద కులదైవానికి పూజలు చేసి, నైవేద్యాలను సమర్పించారు. అనంతరం వాగులో తొట్టేలను విడిచిపెట్టి గంగమ్మకు పూజలు చేశారు. తమను చల్లంగా చూడాలని మొక్కుకున్నారు. ఉత్సవాల్లో సంఘం అధ్యక్షుడు ప్రభు, రంగయ్య, సాయిలు, శేఖర్, నర్సిములు, కిష్టప్ప, రాజు, మహిళలు పాల్గొన్నారు.



ప్రదక్షిణ చేస్తున్న మహిళలు

హజ్‌యాత్రకు వెళ్తున్న వ్యక్తికి అభినందన

మద్దూరు, న్యూస్‌టుడే: హజ్‌యాత్రకు వెళ్తున్న సర్దార్‌సాబ్‌ను పట్టణంలోని మిలత్ సహార కమిటీ ఆధ్వర్యంలో శాలువా, పూలమాలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఆధ్యక్షులు గులాం రసూల్, సభ్యులు హాజీబ్, చాంద్‌పాషా, రుఖ్మోద్దీన్, మైమూద్, సలామ్, ఉషేన్, షేక్‌మైమూద్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి

నేటి నుంచి క్రీడా పోటీలు

బొంరాస్‌పేట: కొడంగల్ నియోజకవర్గంలో సోమవారం నుంచి జోనల్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జోనల్ కార్యదర్శి వడెన్న తెలిపారు. ఈ నెల 21న బొంరాస్‌పేటలో వాలీబాల్ పోటీలు, 24న దౌల్తాబాద్‌లో కబడ్డీ, 29న దౌల్తాబాద్ మండలంలోని కుదురుమళ్లలో ఖో- ఖో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు బోనాఫైడ్, ఆధార్ కార్డులతో హాజరు కావాలని సూచించారు.

భగీరథ పైపుల్లో బురద...బస్సుల కోసం ఇక్కట్లు!

నామమాత్రంగా పనులు

రాకంచర్ల(పూడూరు): మండల పరిధిలోని రాకంచర్ల సమీపంలో చేపట్టిన మిషన్ భగీరథ పైపులైన్ పనులు నామమాత్రంగా సాగుతున్నాయి. పైపులు అమర్చేందుకు రోడ్డు పక్కన గుంతలు తీసి పైపులు వేశారు. ఇంతవకు బిగించక పోవటంతో వర్షాలకు బురద, చెత్తా చెదారం పైపుల్లోకి కూరుకు పోయింది. సిబ్బంది పట్టించుకోకుండా అలాగే అమరిస్తే నీరు కలుషితం అయ్యి రోగాలు వచ్చేందుకు ఆస్కారం ఉందని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.



పైపులో కూరుకు పోయిన బురద

బస్టాండు ఆవరణ అస్తవ్యస్తం

పూడూరు: మండల పరిధిలోని మన్నెగూడ ప్రయాణ ప్రాంగణం ఆవరణ బురదమయంగా మారటంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం ఇక్కడి నుంచి అనేక ప్రాంతాలకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. వికారాబాద్, పరిగి, హైదరాబాద్ వైపు వెళ్లే వారు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు బస్టాండులో బస్సులు దిగి మరో బస్సు ఎక్కేందుకు బస్టాండులోకి వస్తుంటారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో ఆవరణ మొత్తం బురదమయంగా మారటంతో ఇబ్బందులకు గురవుతున్నారు.



బురదలో ప్రయాణికుల ఇక్కట్లు

బస్సు సౌకర్యం లేక అవస్థలు



కాలినడకన వెళ్తున్న ప్రజలు

మేడికొండ(పూడూరు): మండల పరిధిలోని మేడికొండ, కొత్తపల్లి తదితర గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ బస్సు సదుపాయం లేక పోవటంతో జనాలు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు ఉన్న ప్రతి గ్రామానికి బస్సులు వేస్తామని ఆర్టీసీ అధికారులు చెబుతున్న అమలు కావటం లేదని ప్రజలు వాపోతున్నారు. పలుమార్లు వారికి ఫిర్యాదు చేసినా పట్టించు కోవటం లేదని పేర్కొంటున్నారు. చేసేది లేక సుమారు 4 నుంచి 5 కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాలను అభివృద్ధి చేయాలి



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే టీఆర్ఆర్

కుల్కచర్ల: మండలం ముక్తవెంకటాపూర్‌లో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి సర్పంచ్ ఎల్పటి సంధ్యారాణి ఆధ్వర్యంలో భూమి పూజ ఆదివారం జరిగింది. ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి, డీసీఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బీంరెడ్డి, విపణి అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ సేరిరాంరెడ్డి, అసైన్‌మెంట్ కన్వీనర్ భరత్, ఎంపీటీసీ బుడ్డమ్మ, మండల ఎంపీటీసీల సంఘం మాజీ అధ్యక్షులు రాజప్ప, ముక్తవెంకటాపూర్ మాజీ సర్పంచ్ రాందాస్ తదితరులు భూమిపూజను నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి మాట్లాడారు. గ్రామ పంచాయతీ భవనానికి రూ. 13 లక్షలు మంజూరు అయ్యాయని అన్నారు. సాధ్యమైనంత త్వరలో నిర్మాణాన్ని పూర్తి చేసి కొత్త భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఆయన స్థానిక సర్పంచ్‌కు సూచించారు. ముక్తవెంకటాపూర్‌లో 90 శాతం గిరిజనులు ఉన్నారని, ఈ గ్రామ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఆయా పథకాలను సద్వినియోగం చేసుకోని గ్రామంలో మౌలిక వసతులను కల్పిస్తున్నారని అన్నారు. మరిన్ని నిధులను మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

అర్థిక సహాయం అందజేత



సామగ్రిని అందజేస్తున్న ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి

కుల్కచర్ల: మండల కేంద్రంలో మూడు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు అవుసుల ప్రభావతి ఇంటి తాళాలను విరగొట్టి ఇంట్లోను దుస్తులు, ఇతర సామగ్రిని దగ్ధం చేసారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి, డీసీఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బీంరెడ్డి వంట సామగ్రి, సరకులు, దుస్తులు, రూ.5000 నగదును అందజేశారు. సంఘటనకు సంబంధించిన వివరాలను ఆరాతీసారు. ఆమెను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, అన్ని విధాలుగా తాము ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్ సేరి రాంరెడ్డి, అసైన్‌మెంట్ కన్వీనర్ భరత్ తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



బి బాబు



కె అనిల్‌కుమార్

పరిగి: పరిగి మండల ముదిరాజ్ యువసేన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా పి మాణిక్యం, రాములు, అధ్యక్షునిగా కె అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా బి బాబు, ఉపాధ్యక్షులుగా కె రవికుమార్, రాంచంద్రయ్య, ఆంజనేయులు, నర్సిములు, శ్రీనివాస్, రమేష్, మొగులయ్య, నాగరాజ్, కాశీనాథ్, వెంకట్రాములు, కార్యదర్శులుగా వెంకటేష్, పండరి, శ్రీనివాస్, బాల్‌రాజ్, శ్రీకాంత్, చంద్రశేఖర్, సంతోష్, బాబయ్య, శేఖర్, నరేష్‌కుమార్, శివ, మీడియా కన్వీనర్‌గా పి బాబయ్య, క్రీడా విభాగం కన్వీనర్‌గా బి శ్రీనివాస్, సలహా సంఘం సభ్యులుగా బి లక్ష్మయ్య, ఎం నాగేశ్వర్, మాణిక్యం, కె శ్రీనివాస్, కె మల్లేశం, పి వెంకటేష్ ఎన్నికయ్యారు.

హిందీ భాష జాతీయ సంపద



మాట్లాడుతున్న సర్పంచి విజయమాల



హాజరైన విద్యార్థులు

పరిగి, న్యూస్‌టుడే: హిందీ భాష జాతీయ సంపద అని, అందరికీ తెలిసిన భాష అని సర్పంచి ఎ విజయమాల అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం హిందీ ప్రచార సభ హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రచారసభ ఆధ్వర్యంలో సంయుక్తంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హిందీ సరళమైన భాష, అందరూ నేర్చుకోవచ్చని సూచించారు. విద్యార్థుల్లో అంతర్గతంగా ఉన్న ప్రతిభ పోటీల ద్వారా బయటపడుతుందని పేర్కొన్నారు. అనంతరం హిందీ కేంద్ర వ్యవస్థాపకులు, ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రచార సభ కోశాధికారి జి గంగాధర్ మాట్లాడుతూ... స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా రాజభాష హిందీ అభివృద్ధికి నోచుకోకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల్లో భాష పట్ల పరిజ్ఞానం పెంచేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. హిందీ భాషలో సరైన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. హిందీ పండిత్ బిలాల్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లుగా లాంగ్వేజ్ పండిత్ పరీక్షలు నిర్వహించకపోవడంతో అభ్యర్థులు నిరాశకు గురవుతున్నట్లు తెలిపారు. హిందీ భాషతోనే ఐక్యతను చాటిచెప్పవచ్చన్నారు. హిందీ పండిత్‌లు జి అనిత, శ్రీప్రియ, బాలకృష్ణ, మల్లేశం, సంధ్యారాణి మాట్లాడుతూ హిందీలో గొప్ప కవుల సాహిత్యం ఉందని నేర్చుకున్నప్పుడే విషయం అర్థమవుతుందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి భాష పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అనంతరం 'హిందీలేని ప్రాంతంలో రాష్ట్ర భాష ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీల్లో 165 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఉపాధ్యాయ నియామక ప్రక్రియ చేపట్టాలి

కుల్కచర్ల గ్రామీణ, న్యూస్‌టుడే: కొత్త జిల్లాల ప్రకారం ఉపాధ్యాయ నియామక ప్రక్రియ చేపట్టాలని విద్యార్థి సంఘాల నాయకులు రవి, రాఘవేంద్రాచారి, రామస్వామి తదితరులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కొత్త జిల్లాల ప్రకారం నియామక ప్రకటన జారీ చేసి నియామకాలు త్వరగా చేపట్టాలన్నారు. హైకోర్టు తీర్పుకు అనుగుణంగా ప్రభుత్వం వెంటనే నోటిఫికేషన్ జారీ చేయాలని కోరారు. ప్రతి సంవత్సరం డీఎస్సీ ప్రకటన ఆలస్యం కారణంగా నిరుద్యోగులు ఆసహనం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

పార్టీ పటిష్టానికి కృషి



కాంగ్రెస్ పార్టీలో చేరిన తెరాస ఎస్టీసెల్ నాయకులు

కుల్కచర్ల: తెరాస జిల్లా ఎస్టీసెల్ నాయకులు పులి రాములు ఆదివారం కుల్కచర్లలో పరిగి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా తెరాసలో ఎంతో కాలంగా పార్టీకి సేవలందిస్తున్నప్పటికీ తగిన గుర్తింపు లేదని అందుకే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వివరించారు. పార్టీ పటిష్టానికి కృషి చేస్తామన్నారు. తెరాసలో ఇటీవల పంపిణీ అయిన ట్రాక్టర్లను ఉన్నత వర్గాలకే ఇచ్చారని అన్నారు. అర్హులైన వారికి న్యాయం జరగడం లేదని అందుకే పార్టీని వీడుతున్నానని అన్నారు. తెడేపాకు చెందిన మాణిక్‌నాయక్ కూడా ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బొలుసని బీంరెడ్డి, సేరి రాంరెడ్డి, పర్వతి అంజిలయ్య, మొగులయ్య, భరత్ తదితరులు ఉన్నారు.

అర్హులకు పథకాలను వర్తింప చేయండి

కుల్కచర్ల: అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలను వర్తింప చేయాలని కుల్కచర్ల సర్పంచ్ జానకీరాం పేర్కొన్నారు. కుల్కచర్ల మండల కేంద్రానికి చెందిన బందెయ్య తనకు సదరం ధ్రువ పత్రం ఉన్నా ఆసరా పథకం కింద పింఛను రావడం లేదని సర్పంచ్‌ను కలిసి వాపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసరా పథకం కింద పింఛను అందజేయాలని సంబంధిత అధికారులను కోరారు. అర్హులై ఉండి పింఛను రాకపోవడం సరికాదని అన్నారు. ఇంతకు ముందుకు కూడా అధికారులకు ఈ వివరాలను అందజేశానని అన్నారు. అర్హులైన వారికి పథకాలను వర్తింప చేసినప్పుడే వాటికి సార్థకత ఏర్పడుతుందని తెలిపారు.

పరిగి

ప్రతిభా పాటవాలతో విద్యార్థులకు భవిష్యత్తు

తాండూరు పట్టణం,న్యూస్‌టుడే: నైపుణ్య ప్రతిభ పాటవాలతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని భవసాగన్ క్షత్రియ సమాజ్ ప్రతినిధులు తెలిపారు. సమాజం ఆధ్వర్యంలో తాండూరులో ఆదివారం నైపుణ్య ప్రతిభ పాటవాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజం కార్యదర్శి ఉమేష్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని నైపుణ్యం ఆధారంగా వారిని పోత్సహించాలని, ప్రతి విద్యార్థిలో ఏదో ఒక నైపుణ్యం ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో సమాజం ప్రతినిధులు రామారావు, అంబజీరావు, రవీందర్, పరశురాం పాల్గొన్నారు.

ఆలయాల్లో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

కుల్కచర్ల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని మందిపల్‌లో పోచమ్మ అమ్మవారికి బోనాల ఉత్సవాలను నిర్వహించారు. శ్రావణ మాసం చివరి ఆదివారం రోజున బోనాలు తీయడం ఇక్కడ ఆనవాయితీ. మహిళలు ప్రత్యేకంగా అలంకరించిన బోనాలను గ్రామంలోని పురవీధుల్లో భాజాభజంత్రీల నడుమ ఊరేగించారు. పోచమ్మ దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి సమర్పించారు. పిండి వంటలతో నైవేద్యం సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.


మందిపల్‌లో బోనాల ఊరేగింపు


దోమ: వరద పాయసం పారిస్తున్న రైతులు

దోమ, న్యూస్‌టుడే: పక్షం రోజులుగా వర్షాలు లేక సాగు చేసిన పంటలు వాడిపోయాయి. మొక్కజొన్న పంట పొట్టపోసుకుని గింజలు పట్టే సమయంలోనే వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో 40 శాతం నష్టం జరిగింది. వరుణ దేవుడా ఇకనైనా కరణించవా అంటూ దోమకు చెందిన పలువురు రైతులు దోమ మండలం దిర్సంపల్లి-పాలేపల్లి సరిహద్దులో వెలిసిన బసిరేణిగట్టు ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మేలతాళాలతో భజనలు చేశారు. వర్షాలు పడాలని వేడుకున్నారు. దోమ మండలంలోని ఐనాపూర్, దోమ, పాలేపల్లి, లింగన్‌పల్లి, ఉదాన్‌రావుపల్లి, రాకొండ, లింగన్‌పల్లి, దిర్సంపల్లి తదితర గ్రామాల ప్రజలు వర్షాలు పడని సందర్భాల్లో ఇక్కడకు వచ్చి భక్తి కార్యక్రమాలు చేయడం, వరదపాశం పారించడం ఆనవాయితీగా వస్తోంది. ఇప్పటికే వర్షాలు పడక పంటలు దెబ్బతిన్నాయి. యాసంగిలోనైనా ఈ నష్టం పూడ్చుకునేందుకు వీలుంటుందని పలువురు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


ఇప్పాయిపల్లిలో బోనాలతో మహిళలు

మల్లన్న ఉత్సవాలు..

కుల్కచర్ల, న్యూస్‌టుడే: కుల్కచర్ల మండల పరిధిలోని ఇప్పాయిపల్లిలో మల్లన్న జాతర ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ప్రతి శ్రావణమాసం చివర్లో ఈ ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. ఉత్సవాల్లో భాగంగా శకటోత్సవం, బోనాల ఊరేగింపు నిర్వహించారు. కుల్కచర్ల, రాంపూర్, ఇప్పాయిపల్లి, తిర్మలాపూర్ తదితర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు బోనాలను గ్రామంలోని వీధుల్లో ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. తమ మొక్కులను తీర్చుకున్నారు.


గిరిజనులు అన్ని రంగాల్లో రాణించాలి

కుల్కచర్ల, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని గిరిజనులు అన్ని రంగాల్లోను రాణించాలని పరిగి శాసన సభ్యులు రాంమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. కుల్కచర్ల మండల కేంద్రంలో ఇండియన్ అయిల్ కార్పొరేషన ద్వారా పటేల్‌చెరువు తండాకు చెందిన రవీందర్‌నాయక్ కేటాంచిన పెట్రోల్ బంక్‌ను ఆయన ప్రారంభించారు. వాహనానికి పెట్రోల్‌ను పోశారు. ఇక్కడ నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాలను గిరిజనులు ఆశించిన స్థాయిలో సద్వినియోగం చేసుకోవడం మంచి పరిణామనని పేర్కొంటూ రవీందర్‌ను అభినందించారు. మరిన్ని పెట్రోలు బంక్‌లను పరిగి నియోజక వర్గానికి ఆయిల్ కంపెనీలు మంజూరు ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. తద్వారా మరింత మంది ఉపాధి పొందడానికి వీలవుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి, విపణి అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ జానకీరాం, ప్రాథమిక సహకార సంఘం డైరెక్టర్ సేరి రాంరెడ్డి, ఎంపీటీసీ క్రిష్ణయ్య, అసైన్‌మెంట్ డైరెక్టర్ భరత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంకిరెడ్డి క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితులను కించపర్చటం తగదు

అంగడిచిట్టంపల్లి(పూడూరు): ఏపీ మంత్రి ఆది నారాయణరెడ్డి దళితులను కించపర్చే విధంగా మాట్లాడటం తగదని మాల మహానాడు వేదిక మండల అధ్యక్షులు పోతుల శేఖర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని అంగడిచిట్టంపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మంత్రి దళిత జాతిని అవమాన పర్చే విధంగా మాట్లాడినందుకు ప్రభుత్వం అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు బండల నరేశ్, శివరాజ్, నరేశ్ కుమార్ తదితరులున్నారు.

హలో ఈనాడు



పరిగి	:	8008573272
దోమ	:	8008573274
కుల్కచర్ల	:	8008573275
పూడూరు	:	8008573276
కుల్కచర్ల గ్రామీణ	:	7093981580

పరిగి, పూడూరు, న్యూస్‌టుడే:

సమస్య: గ్రామంలోని విద్యుత్ సరఫరా నియంత్రిక వద్ద ఆన్ ఆఫ్ లేకపోవటంతో ఏదైన మరమ్మతులు చేయాల్సి వస్తే ఇబ్బందులు పడాల్సి వస్తుంది. **– రాజు, తిర్మలాపూర్**

● **సమాధానం:** ఇంతకు ముందు ఇక్కడ ఏర్పాటు చేసిన పరికరం పాడవటంతో తిరిగి అమర్చలేదు. త్వరితగతిన అమర్చి సమస్యను తీరుస్తాం. **– మహవీర్, ఏఈ.**

సమస్య: మిషన్ భగీరథలో భాగంలో ఇటీవల గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన గుంతలు తీశారు. తిరిగి సరిచేయక పోవటంతో రాకపోకలకు ఇక్కట్లు పడుతున్నాం. **– గోపాల్, మన్నెగూడతండా**

● **సమాధానం:** పరిశీలించి గుంతలను పూడ్చి రాకపోకలకు ఇబ్బందులు రాకుండా వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం. **– కుల్సుంబీ, సర్పంచి**

సమస్య: బస్సుల బోర్డులు తప్పుల తడకలుగా ఉంటున్నాయి. దీంతో పడరాని పాట్లు పడుతున్నాం. నూతన బోర్డులు ఏర్పాటు చేయాలి. **–జ్యోతి, పరిగి**

● **సమాధానం:** నూతన బోర్డులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వారం రోజుల్లో పూర్తి చేసి ఎలాంటి సమస్య లేకుండా చూస్తాం. **– మోహన్‌రావు, డీఎం.**

సమస్య: కరెంటు తక్కువగా వినియోగిస్తున్నా బిల్లులు మాత్రం అధికంగా వస్తున్నాయి. దీంతో అదనపు భారంతో నష్టపోవాల్సి వస్తోంది. బిల్లులు పారదర్శకంగా వచ్చేలా చూడాలి. **– రాజేష్‌కుమార్, పరిగి**

● **సమాధానం:** వినియోగం మేరకు బిల్లులు వస్తాయి. సాంకేతిక సమస్యలేమైనా ఉంటే సరిచేసేందుకు కృషి చేస్తాం. **– రాంచంద్రయ్య, ఏఈ.**

మొరాయిస్తున్న రేషన్ యంత్రాలు

కుల్కచర్ల గ్రామీణ, న్యూస్‌టుడే: రేషన్ సరకులను పంపిణీ చేయడానికి ఏర్పాటు చేసిన యంత్రాలకు సిగ్నల్ అందక పోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఘనాపూర్, సాల్వీడ్ గ్రామాలలో యంత్రాలకు సిగ్నల్ అందడం లేదు. దీంతో రేషన్ దుకాణాల దగ్గర ప్రజలు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు తెలియజేస్తున్నారు. గత నెలలో రేషన్ సరకుల పంపిణీలో ఎలాంటి పారదర్శకత లేకుండా ఉండేందుకు డీలర్లకు యంత్రాలను అందించారు. కుటుంబ సభ్యుని వేలిముద్ర సహాయంతో సరకులను అందించారు. యంత్రాలకు సిగ్నల్ అందక నానా ఇబ్బందులు ఎదుర్కొన్న పరిస్థితులు ఉన్నాయి. కానీ ప్రస్తుత నెలలో కూడా ఈ ఇబ్బందులు తప్పడం లేదు. నెల ప్రారంభం నుంచి సరకులను అందిస్తున్నా కూడా ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో ప్రజలకు సరకులు పంపిణీ చేసిన దాఖలాలు లేవు. సమస్యను రెవెన్యూ అధికారులకు విన్నవించినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రేషన్ డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి రేషన్ పంపిణీ యంత్రాలకు సిగ్నల్ అందించే విధంగా చూడాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.


ఘనాపూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు

పూజలకు తరలుతున్న గణనాథులు


వాహనాల్లో వినాయక విగ్రహాలు

పూడూరు: వినాయక చవితి పండుగ దగ్గర పడుతున్న కొద్దీ విగ్రహాలను తీసుకు వచ్చేందుకు భక్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. వీధుల్లో, కాలనీల్లో ప్రతిష్ఠించేందుకు ప్రతిమలను సమీపంలోని పట్టణాల నుంచి తీసుకు వస్తున్నారు. పూజా సామగ్రితో పాటు అలంకరణ వస్తువులు, సమకూర్చు కుంటున్నారు. తమకు అనుకూలమైన ప్రదేశంలో వినాయకులను ప్రతిష్టాపన చేసేందుకు మండపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.

రక్త నమూనాలు తెలిసి ఉండాలి

అంగడిచిట్టంపల్లి (పూడూరు): ప్రతి ఒక్కరికీ రక్త నమూనాలు తెలిసి ఉండాలని సర్పంచి నవీన్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని అంగడిచిట్టంపల్లిలో యంగ్ లీడర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రక్త నమూనాల సేకరణ శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యవసరం, ఆపద సమయంలో రక్తం కావాల్సి వచ్చినప్పుడు గ్రూపు తెలిసి ఉంటే సత్వరమే అందించేందుకు వీలు కలుగుతుందని సర్పంచి చెప్పారు. ప్రతి ఒక్కరు ఇలాంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యంగ్ లీడర్ సంస్థ మండల సమన్వయకర్త సత్యం గ్రామస్తులు రవిచందర్, బంటు పాండు, రాములు, సంగమేశ్వర్, శ్రీనివాస్ తదితరులున్నారు.


రక్త నమూనా వివరాలను పంపిణీ చేస్తున్న నవీన్‌కుమార్

పాస్ పుస్తకాల పరిశీలన


ఇప్పాయిపల్లిలో వివరాలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

కుల్కచర్ల: ఇప్పాయిపల్లి, కుస్మసముద్రం, అనంతసాగర్ తదితర గ్రామాల్లో గత రెండు రోజులుగా రెవెన్యూ అధికారులు పర్యటిస్తున్నారు. వారి పాసుపుస్తకాలను తీసుకుని పరిశీలిస్తున్నారు. తమ దగ్గర ఉన్న రెవెన్యూ రికార్డులతో సరిపోల్చుకుంటున్నారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం సమగ్ర భూ సర్వేను చేయించేందుకు సిద్ధమైందన్నారు. తద్వారా ఎప్పటి నుంచో భూములపై ఉన్న సందేహాలు తొలగిపోతాయని వివరించారు. పూర్తి స్థాయి సమాచారాన్ని తాము సేకరిస్తున్నామని అన్నారు. అన్ని అనుకున్నట్లు చేస్తే రైతుల ఇబ్బందులు తొలగిపోతాయని వారు వివరిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరాలి

తాండూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి కార్యకర్త ప్రతి బూత్ స్థాయిలో ప్రచారం నిర్వహించాలని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్యాట బాల్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆర్య వైశ్య కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన భాజపా పట్టణ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే కేంద్ర ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించాలని సూచించారు.

29 నుంచి సెల్ట్‌లో తరగతులు

ఓయూ: ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్)లో తరగతులను ఈ నెల 29వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు సెల్ట్ సంచాలకులు డా. సావిత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఆంగ్లంలో సరళంగా సంభాషణ, వ్యక్తిత్వ వికాసంలో రెండు నెలల కాల వ్యవధి గల ఈ కోర్సుకు ఉదయం, సాయంత్రం వేర్వేరుగా తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9652856107 ఫోన్లో సంప్రదించవచ్చని సూచించారు.

ఎల్ఈడీ కాంతి ఊపందుకుంది

ఇప్పటికి 75 వేల దీపాలు ఏర్పాటు

హైదరాబాద్, న్యూస్‌టుడే: విద్యుత్‌ను పొదుపు చేసేందుకు జీహెచ్ఎంసీ చేపట్టిన ఎల్ఈడీ దీపాలను అమర్చే పనులు ఊపందుకున్నాయి. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఎనర్జీ ఎఫిసియెన్సీ ఈ నిర్వహణను చేపట్టి ప్రస్తుతం 75,621వేల దీపాలను ఏర్పాటు చేశారు. మిగత దీపాల పనులు కూడా ఊపందుకున్నాయని జీహెచ్ఎంసీ పేర్కొంది. ప్రస్తుతం ఏర్పాటు చేసిన దీపాలతో రోజుకు 5,164 కిలోవాట్ల విద్యుత్ ఆదా అవుతుందని, నగరవ్యాప్తంగా 4లక్షల60వేల ఎల్ఈడీ దీపాలతో ఏడాదికి 20.73 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఆదా అవుతుందని బల్దియా పేర్కొంది. తద్వారా బల్దియాకు రూ.14.72కోట్లు ఖర్చుతో పాటు 16.587టన్నుల కార్బన్‌డయాక్సైడ్ విడుదల తగ్గుతుందన్నారు. 18,35,70,110,190 వాట్స్ సామర్థ్యం కలిగిన ఎల్ఈడీ దీపాలను నగరంలో ఆయా ప్రాంతాల ప్రాధాన్యం బట్టి అమరుస్తున్నారని వివరించింది.

కలిసొచ్చిన కాలం..

లాభాలవైపు 'పయనం'

ఊరటనిస్తున్న వంగ, టమాట


కళకళలాడుతున్న వంగ తోట

న్యూస్‌టుడే, మోమిన్‌పేట

వర్షాకాలం కలిసి రావడంతో వంగ టమాట పంటలను సాగు చేసుకున్న రైతులు లాబాల బాటలో పయనిస్తున్నారు. వేసవి కాలంలో మండుతున్న ఎండలను తట్టుకోలేక కూరగాయ పంటలపై అధికమంది రైతులు దృష్టి సారించలేదు. రెండు సంవత్సరాలుగా కూరగాయలకు అనుకున్న ధరలు లేకపోవడంతో తీవ్ర నష్టాన్ని చవిచూశారు. దీంతో నీళ్లు ఉన్న బోరు బావుల కింద కూరగాయ పంటలకు బదులు పత్తి, మొక్కజొన్న పంటలను సాగుచేసుకుంటున్నారు. టమాట, వంకాయ పంటల సాగును పూర్తిగా తగ్గింది. మండలంలో మోమిన్‌పేట, సయ్యదపల్లిపూర్, మల్లారెడ్డిగూడెం, రాంనాథ్‌గుడిపల్లి, గోవిందాపూర్, చీమలధరి, చెక్రంపల్లి, ఎన్కతల, కోల్కుంద, తదితర గ్రామాలల్లో కలిపి 100 ఎకరాలల్లో టమాట పంటను సాగుచేస్తున్నారు. 250 ఎకరాల్లో వంకాయ పంటను సాగుచేసుకుంటున్నారు. ఒక ఎకరంలో వంకాయ పంట సాగుచేస్తే వారానికి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. క్వింటాలు వంకాయలు అమ్మితే రూ.20 నుంచి 25 వేలు వస్తున్నాయి. టమాట ఎకరం పొలంలో ఉంటే వారానికి 60 బాక్సుల దిగుబడి వస్తుంది. ఒక్క బాక్సు రూ.700నుంచి 1000 రూపాయలు అమ్ముతున్నాయి. వారానికి ఎకరం పంటకు గాను రూ.40 నుంచి 50వేలు వస్తున్నాయి. టమాట, వంకాయ పంటలు కష్టపడి సాగుచేసుకున్న రైతులు నేడు కొద్దో గొప్పో ఆర్థికంగా లాభాలు చవిచూస్తున్నారు. తమ కష్టానికి ఫలితం లభిస్తోందని నమ్ముకున్న పొలం ఎప్పుడో ఒకప్పుడు ఆశీర్వదిస్తదంటే ఈ సంవత్సరం టమాట, వంకాయ పంటలు సాగుచేసుకున్న రైతులను ఆశీర్వదించాయని పలువురు రైతులు పేర్కొన్నారు.


గంపల్లో వంకాయలు నింపుతున్న రైతు

ఆలోచన గొప్పగా.. ఆచరణ చప్పగా!

అటకెక్కిన జీపీఎస్ నిఘా ప్రాజెక్టు • ఉత్తర్వులు వచ్చినా అమలు కాని వైనం

ఈనాడు, హైదరాబాద్

గ్రేటర్‌లో రవాణా వాహనాలపై నిఘాకు సంబంధించి గతంలో ఉత్తర్వులు ఇచ్చినా అమలుకు నోచుకోలేదు. నగరానికి వచ్చే పర్యాటకలు, సందర్శకులు, కొత్తవారికి భరోసా కల్పిస్తూ క్యాబ్‌లు, ఆటోలు ఇతర ప్రజా రవాణా వాహనాల్లో భద్రతకు పెట్టపీట వేయాలనేది యోచన. ఇందులో భాగంగా గ్రేటర్‌లో ప్రతి వాహనానికి గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్(జీపీఎస్) విధానం తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వం రవాణా శాఖ మంత్రి ఆధ్వర్యంలో ఒక అధికారిక బృందాన్ని ముంబయికి పంపింది. అక్కడ పోలీసులు, రవాణా శాఖ అధికారులతో సమావేశమయ్యారు. క్యాబ్‌లు, వాహనాల్లో అమలు చేస్తున్న జీపీఎస్ విధానాన్ని పరిశీలించారు. మంచి ఫలితాలు ఇస్తుండటంతో గ్రేటర్ హైదరాబాద్‌లోనూ ఇదే విధానం చేయాలని ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఈ నేపథ్యంలో ప్రతి వాహనానికీ జీపీఎస్ తప్పనిసరి చేస్తూ నిర్ణయించారు. తొలుత క్యాబ్‌ల్లో అందుబాటులోకి తెచ్చాక మిగతా అన్ని రవాణా వాహనాలకూ తప్పనిసరి చేయాలని నిర్ణయించారు. గతంలో నగరంలో అభయ సంఘటన తర్వాత క్యాబ్‌లు, ఆటోలపై ప్రత్యేక నిఘా పెట్టాలని భావించారు. ఇది ప్రకటనలకే పరిమితమైంది. ఇంతవరకు ఒక్క అడుగూ ముందుకు పడలేదు. ఇటీవలి ఉప్పల్ ఓ క్యాబ్ డ్రైవర్ కిడ్నాప్ చేసిన ఉదంతంతో మరోసారి భద్రత వైఫల్యాలు వెలుగులోకి వచ్చాయి. జీపీఎస్ నిఘా తప్పనిసరి అనే డిమాండ్ మరోసారి తెరపైకి వచ్చింది.

భద్రతకు భరోసా ఇవ్వాలని...

ప్రస్తుతం నగరంలో తిరుగుతున్న కొన్ని క్యాబ్‌లకు, ఆటోలపై ఎలాంటి పర్యవేక్షణ లేదు. ముఖ్యంగా మహిళా ప్రయాణికుల భద్రత గాలిలో దీపంలా మారుతోంది. క్యాబ్ డ్రైవర్లు మహిళలతో అనుచితంగా ప్రవరిస్తున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. కొందరు ఆటో డ్రైవర్లది అదేదారి. ప్రయాణికుల పట్ల అనుచితంగా ప్రవర్తించడం... లైంగిక వేధింపులకు గురిచేయడం లాంటి కేసులు వివిధ పోలీసు స్టేషన్లలో నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి వాహనానికీ జీపీఎస్ పెట్టి దానిన్ని పోలీసు కంట్రోల్ రూంకు అనుసంధానించాలని అధికారులు నిర్ణయించారు. ప్రతి క్యాబ్/ఆటోపై పోలీసుల ప్రత్యక్ష నిఘా ఉంటుందని భావించారు. అనుకోని సంఘటన ఎదురైనప్పుడ వాహనం ఎక్కడ ఉందో ఈ జీపీఎస్‌తో ఇట్టే కనిపెట్టవచ్చు. ప్రయాణికులతో డ్రైవర్లు అనుచితంగా ప్రవర్తించినా, వాహనానికి ఏదైనా ప్రమాదం సంభవించినా... పరికరంలో ఉన్న పానిక్ బటన్ నొక్కితే చాలు... కంట్రోల్ రూంకు సంక్షిప్త సందేశం రూపంలో సమాచారం వెళుతుంది. బండి నంబరు, ప్రాంతం ఇట్టే తెలుస్తాయి. వెంటనే సమీప ప్రాంతంలోని పోలీసులను అప్రమత్తం చేసి రంగంలోకి దించే అవకాశం ఉంది. నగరంలోని ప్రతి ఆటో, క్యాబ్‌ను ట్రాక్ చేయడమంటే మాటలు కాదు. ఇందుకు పోలీసు కంట్రోల్ రూంలో భారీ స్థాయిలో కంప్యూటర్ తెరను ఏర్పాటు చేయాలనేది యోచన. దీనిని 24 గంటలపాటు పర్యవేక్షించడానికి ప్రత్యేక సిబ్బందిని నియమించనున్నారు.

ఏదీ ఎక్కడ?

గ్రేటర్‌లో దాదాపు 1.60 లక్షల వరకు ఆటోలు, 70 వేల వరకు క్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఇవి కాకుండా 2,000 పాఠశాల బస్సులు, 700 వరకు మినీ బస్సులు, ఇతర రవాణా వాహనాలు తిరుగుతున్నాయి. గతంలో జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఈ వాహనాలన్నీ జీపీఎస్ పరిధిలోకి రావాలి. ఇంతవరకు ఒక్క అడుగూ ముందుకు పడలేదు. నిధుల సమస్య కారణంగా ప్రాజెక్టు అటకెక్కినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా జీపీఎస్ పరికరాల్ని సంబంధిత వాహనదారులే సమకూర్చుకోవాలి. క్యాబ్‌లు, బస్సుల వరకు పెద్దగా ఇబ్బందులు లేకపోయినప్పటికీ ఆటోల విషయంలో ఈ విధానం అమలు చేయాలంటే భారంతో కూడుకున్న వ్యవహారం. ఒక్కో వాహనానికి జీపీఎస్ పరికరాలు సమకూర్చుకోవాలంటే రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు ఖర్చవుతుంది. ఆటో వాలాలు ఈ ఖర్చు భరించే పరిస్థితి లేదు. ఉత్తర్వుల తర్వాత అధికారులు పట్టించుకోవడం మానేశారు. పరిస్థితి యథాస్థితికి వచ్చిందని ప్రయాణికులు వాపోతున్నారు.

కోర్టు వాయిదాకొచ్చి యువతిపై అత్యాచారం

మేడిపల్లి(బోడుప్పల్), న్యూస్‌టుడే: ప్రేమ పేరుతో యువతిపై అత్యాచారానికి పాల్పడిన యువకుడిపై మేడ్చల్ జిల్లా మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బోడుప్పల్ హేమానగర్‌కు చెందిన యువతి(30), కామారెడ్డి జిల్లాకు చెందిన ఇర్ఫాన్(35) నగరంలోని జెన్‌ప్యాక్ట్‌లో సహోద్యోగులు. కొంతకాలం ప్రేమ పేరుతో సన్నిహితంగా ఉన్నారు. ఈ క్రమంలో ఇద్దరు పెళ్లి చేసుకొవాలని నిర్ణయించుకున్నారు. యువతి ఇర్ఫాన్ వద్ద పెళ్లి ప్రస్తావన తీసుకు రాగా అతను ముఖం చాటేయడంతోపాటు కామారెడ్డికి మకాం మార్చాడు. మోస పోయినట్లు నిర్ధారించుకొని బాధిత యువతి అప్పట్లో ఉప్పల్ పోలీసులను ఆశ్ర యించింది. 2016లో ఉప్పల్ పోలీసు స్టేషన్‌లోనూ ఇర్ఫాన్‌పై కేసు నమోదై కోర్టు వాయిదాలు నడుస్తున్నాయి. శనివారం కోర్టు వాయిదాకు వచ్చిన ఇర్ఫాన్ బాధిత యువతితో మాట్లాడలంటూ నేరుగా హేమానగర్‌లోని ఆమె ఇంటికి వెళ్లి అత్యాచా రానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఇర్ఫాన్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్‌రెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

తాళంవేసిన ఇంట్లో బంగారం, వెండి చోరీ

నాగోలు, న్యూస్‌టుడే: తాళంవేసిన ఇంట్లో నగలు దోచుకెళ్లిన సంఘటన ఎల్బీన గర్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... బండ్లగూడ సమీ పంలోని మధురానగర్‌లో నివసించే సాయిలు(45), ఆయన తన కుటుంబంతో కలిసి ఈ నెల 18న శిరిడీ పుణ్యక్షేత్రానికి వెళ్లి తిరిగి ఆదివారం ఉదయం ఇంటికి చేరుకు న్నారు. ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి ఉండటంతో లోనికి వెళ్లిచూడగా 3తులాల బంగారం, 30తులాల వెండి చోరికి గురవడాన్ని గమనించి.. ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

సేద్యపు కుంటలే రక్ష!

(మొదటిపేజీ తరువాయి) గుంత తవ్వుకున్న రైతులకు ఉపాధి హామీలో భాగంగా పనిదినాలతో పాటు సహచర కూలీలకు డబ్బులు ఈ పథకం నుంచే చెల్లిస్తారు. సేద్యపు కుంటలు తవ్వుకుంటే వర్షపు నీరు నిలుస్తుంది. ఫలితంగా పంటకు తడి అవసరమైనపుడు, ఈ నీటిని వినియోగించుకునే సౌలభ్యం ఉంటుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావించాయి. స్థానికంగా పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది.

లక్ష్యం 15,400: జిల్లాలో ఈ ఏడాది మొత్తం 15,400 సేద్యపు కుంటలు తవ్వా లని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. అయితే ఇప్పటి వరకు 13,683 సేద్యపు కుంటల తవ్వకానికి ఉపాధి హామీ అధికారులు అనుమతులు మంజూరు చేశారు. పనులు చేపట్టేందుకు రైతులు పెద్దగా ఆసక్తి చూపలేదు. కేవలం 431కే పరిమితం అయింది. మరో 4,208 కుంటల పనులు కొనసాగుతున్నాయి. వర్షాకాలం ప్రారం భమై, రైతులు పొలం పనుల్లో ఉండడంతో పనులు నెమ్మదించాయి. ప్రస్తుతం వరు ణుడు ముఖం చాటేశాడు. భూమి తడారిపోతోంది. పంటలు ఎండలకు వాడిపోతు న్నాయి. అన్నదాతలు వర్షంకోసం ఎదురు చూస్తున్నారు. గతంలోనే సేద్యపు కుంటలు తవ్వుకుంటే బాగుండేదని రైతులు వాపోతున్నారు. జిల్లా సాధారణ వర్షపాతం 814 సెంటీమీటర్లు. ప్రస్తుతానికి సుమారుగా 73 శాతం లోటు వర్షపాతం నమోదైంది.

ఇప్పుడైనా తవ్వుకోవచ్చు: జాన్సన్, డీఆర్‌డీఓ

సేద్యపు కుంటల తవ్వకానికి అనుమతులు మంజూరు చేసినా రైతులు ఆసక్తి చూపలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ కుంటలు రైతుకు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. ఇప్పటికైనా ముందుకొస్తే అన్ని రకాల ప్రభుత్వ రాయితీలను, ప్రోత్సా హకాలను అందించేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. ఆసక్తి ఉన్న రైతులు గ్రామా ల్లోని ఉపాధి సిబ్బందిని సంప్రదిస్తే పూర్తి స్థాయి వివరాలు తెలుసుకోవచ్చు.

'రాయితీ'కి.. తిలోదకాలు!

(మొదటిపేజీ తరువాయి) రాయితీ సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చిన అధి కారుల మాటలు నీటి మూటలైపోయాయి. అంతేగాకుండా ప్రభుత్వం నుంచి ఈ ఏడాది నిధులు రావని ప్రస్తుతానికి అధికారులకు సమాచారం అందింది. దీంతో ఈ ఏడాదికి ఇంతే వచ్చే ఏడాది ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే రాయితీ విత్త నాలు సరఫరా చేస్తామని ఉద్యాన శాఖాధికారులు పేర్కొంటున్నారు.

ఎకరాకు రూ.1,200

కూరగాయ సాగు చేస్తున్న రైతులకు రాయితీపై విత్తనాలు అందించేందుకు ప్రభుత్వం గరిష్ఠంగా ఎకరాకు రూ.1,200 చెల్లించాలని నిర్ణయించింది. జిల్లాలో సుమారు 50వేల ఎకరాల్లో కూరగాయల సాగు జరుగుతోందని అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఏడాది సుమారుగా రాయితీ మొత్తంగా జిల్లా ఉద్యాన రైతులకు రూ.15 లక్షలు అందించామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం రాయితీ విత్తనాలు అందకపోవటంతో కూరగాయ రైతులు ప్రైవేటు వ్యాపారులను, దుకాణాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి. ఈ క్రమంలో ఆర్థిక భారం పెరుగుతూనే వ్యాపారి ఇచ్చిన విత్తనాలతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. దీంతో ధరలు పెరి గాయి. మేలు జాతివి అందక దిగుబడులు తగ్గి సాగు సమస్యల వలయంగా మారిందని రైతులు ఆరోపిస్తున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

–సంజయ్‌కుమార్, ఉద్యాన శాఖాధికారి

ఈ ఏడాది కూరగాయల విత్తనాలు రాయితీపై సరఫరా చేసేందుకు నిధులు రాలేదు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. వారి నుంచి ఆదేశాలు వస్తే పంపిణీ చేసేందుకు కృషి చేస్తాం.

సమాచారం ఇవ్వడం లేదు

–బుచ్చయ్య, పెండ్లిమడుగు. వికారాబాద్ మండలం



రాయితీ విత్తనాలు ఎప్పుడు వస్తాయో తెలీదు. అధి కారులు సమాచారం ఇవ్వరు. మల్చింగ్ విధానం తెలియక ఇప్పటి వరకు వేసుకోలేదు. ప్రైవేటులో తెచ్చుకుంటున్నాం. అధిక ధరల వల్ల పెట్టుబడి పెరుగుతోంది.



కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం



రాజీవ్ గాంధీ విగ్రహం ముందు నివాళులు అర్పిస్తున్న నేతలు

భగ్గుమన్న కాంగ్రెస్ వర్గ విభేదాలు!

గ్రూపులుగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకల నిర్వహణ

తాండూరు, న్యూస్‌టుడే: మాజీ ప్రధాన మంత్రి దివంగత రాజీవ్ గాంధీ జయంతి వేడుకల సంద ర్భంగా తాండూరు పట్టణంలో ఆదివారం కాంగ్రెస్ నేతల మధ్య వర్గ విభేదాలు భగ్గు మన్నాయి. నువ్వెంత అంటే నువ్వెంత అంటూ దూషించుకు న్నారు. చివరకు మాజీ మంత్రి ఎం.చంద్రశేఖర్ రావు తనయుడు ఎం.నరేష్, తదితరుల జోక్యంతో పరిస్థితి సద్దుమణిగింది. వేడుకలను మాత్రం ఎవ రికి వారు నిర్వహించుకుని వెళ్లి పోయారు. తాండూరు పట్టణ సమీపం రాజీవ్‌గృహకల్ప కాల నీలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుక లను ఆదివారం ఉదయం పది గంటలకు నిర్వ హించే విషయాన్ని పట్టణ పార్టీ అధ్యక్షులు ప్రభాక ర్‌గౌడ్ కార్యకర్తలు, నేతలకు ముందే సమాచారం ఇచ్చారు. నిర్ణీత సమాయానికి అరగంట ముందే తాండూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీలో ఓ వర్గంగా ఉన్న మాజీ డీసీసీబీ అధ్యక్షులు లక్ష్మారెడ్డి అనుచర గణంగా ఉన్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ సునీత, పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శ్రీనివాస చారి, డాక్టర్ సంపత్, నియోజక వర్గం యువజన కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సంతోష్‌కు మార్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ సాయిపూర్ నర్సింలు, కౌన్సిలర్ నర్సింలు తదితరులు రాజీవ్‌గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. పూలమాల వేసి నివాళులు అర్పించే సమయంలో రాజీవ్ గృహకల్ప కాలనీకే చెందిన కాంగ్రెస్ నాయకులు ఫయాజ్ జోక్యం చేసుకున్నారు. పార్టీ కార్యక్రమాన్ని అందరం కలిసి నిర్వహించాలే తప్ప మీ వరకు మీరు చేసు కుంటూ పోతే ఎలా? అని ప్రశ్నించారు. ఈ విష యంలో లక్ష్మారెడ్డి, తాండూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శ్రీనివాస చారి జోక్యం చేసుకు న్నారు. మేము నీకెందుకు చెప్పాలి. రాజీవ్ గాంధీ విగ్రహాన్ని మేమే ప్రతిష్ఠించాం. ఎవరికో చెప్పాల్సిన అవసరం తమకు లేదని బదులిచ్చారు. ఈ విష యాన్ని జీర్ణించుకోలేని ఫయాజ్ మరోసారి కాలనీలో పార్టీ కార్యకలాపాలు నిర్వహించి చూడండంటూ బదులివ్వగా ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం మరింత జోరందుకుంది. నువ్వెంత అంటే నువ్వెంత అంటూ గొడవకు దిగారు. అప్పటికే రాజీవ్ గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్న తాండూరు నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఎం.రమేష్ వర్గానికి చెందిన నేతలు మాజీ మంత్రి ఎం.చంద్రశేఖర్ కుమారుడు ఎం. నరేష్, తాండూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రభాకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బషారత్, కోర్వార్ నగేష్, నవాజ్, సర్దార్‌ఖాన్, బాబు వారణాసి, సాబేర్ తదితరులు గొడవను సద్దుమణి గేలా చేశారు. అందరం కలిసి కార్యక్రమం నిర్వహిం చాలన్నపుడు మీరు ముందుగా నిర్వహించడం బాగోలేదని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి రమేష్ వర్గం నాయకులు పేర్కొన్నారు. గొడవ పెద్దది కాకుండా మాజీమంత్రి ఎం.చంద్రశేఖర్ కుమారుడు ఎం.నరేష్ ఇరువురిని సముదాయించ డంతో పరిస్థితి సద్దుమణిగింది. రెడ్డి వర్గం నేతలు విగ్రహం వద్ద నుంచి తాండూరు పట్టణానికి పయనం కాగానే రమేష్ వర్గం నాయకులు రాజీవ్ గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

అక్రమార్కుల గుండెల్లో దడ!

(మొదటిపేజీ తరువాయి) అసమానతలకు కారకుల వుతున్నారు. నిజాయతీగా కాయకష్టంచేసి జీవనం సాగిస్తున్న వారిని శాసించే స్థాయికి ఎదుగుతున్నారు. తాజాగా వీరందరి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఊహించని రీతిలో బషీరాబాద్ మండలం ఎక్మాయిలో 240ఎకరాల భూముల్లోని గనులపై స్వయంగా ఉపపా లనాధికారి రంగంలోకి దిగడంతో అక్రమార్కులు హడ లిపోతున్నారు. రెండురోజులుగా తాండూరు మండ లంలోని ఓగీపూర్, కరణ్‌కోట, మల్కాపూర్, కోటబా స్పల్లి, సిరిగిరిపేట గనుల్లో ఇదే అంశంపై చర్చ జరు గుతోంది. ఈమధ్యే గనుల గ్రామాల వీఆర్‌ఓలను ఆక స్మికంగా బదిలీ చేశారు. నాపరాయి నిక్షేపాలకు పేరు గాంచిన ఓగీపూర్, మల్కాపూర్, కరణ్‌కోట వీఆర్‌ఓ లను ఒకేసారి బదిలీచేసి వారిస్థానంలో కొత్తవారిని నియమించారు.

భారీగా యంత్రాల స్వాధీనం

ఉపపాలనాధికారి సారథ్యంలో ఏకకాలంలో పోలీసు, రెవెన్యూ, గనులశాఖ అధికారుల బృందాలు బషీరాబాద్ మండలం ఎక్మాయిలోని అక్రమ గనులను చుట్టుముట్టారు. గనుల నుంచి యంత్రాలను తర లించే వీల్లేకుండా దారులను మూసివేసేలా కట్టలాగా నిర్మాణం చేయించి వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఏకంగా 25కోత యంత్రాలను జప్తుచేశారు. అంతేగా కుండా వాటిని రాత్రివేళ తరలించకుండా పోలీసులతో నిఘా ఏర్పాటు చేశారు. అధికారులు అన్నిజాగ్రత్తలు తీసుకోవడంతో అక్రమార్కులు తప్పించుకునే వీల్లేకుం డాపోయింది.

బషీరాబాద్‌లో...

అక్రమ గనులపై ఉక్కుపాదం మోపడంతో బషీరా బాద్ మండలంలోని మిగిలిన నాలుగు గ్రామాల్లోని గనుల్లో అక్రమతవ్వకందారులు యంత్రాలతోసహ జారుకున్నారు. ఇక తాండూరు మండలంలో వందకు



ఓగీపూర్‌లో గతంలో రెవెన్యూ అధికారులు నిలిపివేసిన గనిలో మళ్లీ ప్రారంభమైన తవ్వకాలు

పైగా అనుమతుల్లేని గనుల నిర్వాహకుల్లోనూ ఇదే ఆందోళన నెలకొంది. అయినప్పటికీ అక్రమార్కులు ఇంకా మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. తవ్వ కాలు చేపట్టిన గనులకు దూరంగా ఉంటూ కార్మికు లతో పనులు చక్కబెడుతున్నారు. మరికొందరు తమకు రాజకీయ అండదండలున్నాయని, అధికారులు తమ వద్దకు రారని ధీమా వ్యక్తం చేస్తున్నారు. మొత్తా నికి అధికారులు జప్తు చర్యలతో అక్రమ గనులు నిర్వ హిస్తున్న వారిలో గుబులు రేకెత్తేలా చేశారు.

అపరాధ రుసుం వసూలుపై దృష్టి

అక్రమ గనులను సందర్శించి యంత్రాలను జప్తుచేసి తరలించిన అధికార యంత్రాంగం నిక్షే పాల తవ్వకాలకు కొలతలు వేసేందుకు సమాయత్తమవుతున్నారు. తవ్వకాలకు పాల్పడిన వారి వివరాలతోపాటు లోతు, పొడవు, విస్తీర్ణం వంటి పక్కా కొలతలను నమోదు చేసే అవకాశాలున్నాయి. కొల తల ప్రక్రియ పూర్తైన వెంటనే తవ్వకా లకు పాల్పడిన వారినుంచి గనులశాఖ నిబంధనల ప్రకారం నిక్షేపాల రుసుంతో పాటు అపరాధ రుసుం వసూలు చేసేం దుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమా చారం. అనుమతుల్లేకుండా చేపట్టిన తవ్వకాలకు ఐదిం తలకుపైగా అపరాధ రుసుం వసూలుచేసే అవకాశాలు న్నాయి. అధికారులు పదుల సంఖ్యలో గనుల్లో అక్ర మాలను గుర్తించడంతో వీరందరి నుంచి వసూలుచేసే అపరాధ రుసుం భారీమొత్తంలో ఉండే వీలుంది. దీంతో గనులశాఖ కోల్పోయిన ఆదాయాన్ని తిరిగి అక్రమ గనుల ద్వారా పెద్దమొత్తంలో రాబట్టుకోనుంది.

గంట సమయం..మూడు గనుల్లో ఆగిన అక్రమం

గతనెలలో స్థానికుని ఫిర్యాదు మేరకు గనులశాఖ ఏడీ శామ్యూల్‌జాకబ్ ఓగీపూర్ శివారులో మూడు గనులను సందర్శించారు. వీటిని అక్రమంగా నిర్వహి స్తున్నట్లు గుర్తించారు. వెంటనే కోత యంత్రాల చక్రాలు స్వాధీనం చేసుకున్నారు. దీంతో కార్యకలా పాలు ఆగిపోయాయి. కొంతసమయం కేటాయించి పర్యటించడంతో ప్రభుత్వ భూముల్లో రూ.లక్షలు విలు వజేసే నిక్షేపాలు తరలించేందుకు అడ్డుకట్టపడేలా చేశారు. ఏడీ వచ్చివెళ్లినప్పట్నించి అక్రమార్కులు సదరు గనులవైపు కన్నెత్తిచూడకపోవడం గమనార్హం. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తే అక్రమాలకు అడ్డుకట్టపడే వీలున్నప్పటికి సిబ్బంది కొరత సాకుతో కార్యాలయాలకు పరిమితమవుతున్నారు. దీంతో అక్ర మాలు విస్తరించేందుకు దోహదపడుతున్నాయి.



నిరుపయోగంగా మారిన యంత్రాలు

నాణ్యత.. నిర్దేశించిన పరిమాణం.. సరసమైన ధర... ఇవేవీ... రైలు ప్రయాణికులకు విక్రయించే ఆహార పదార్థాల్లో కనిపించడం లేదు. కాంట్రాక్టు దక్కించుకున్న సరఫరాదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీనికితోడు కొందరు అనధికారికంగా రైళ్లలో ప్రవేశించి నాణ్యతలేని ఆహారాన్ని అందించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రయాణికులకు అనారోగ్యాన్ని మిగులుస్తున్నారు. ఈ అంశంపై 'కాగ్' తప్పు పట్టాక రంగంలోకి దిగిన రైల్వే అధికారులకు అనేక విస్తుపోయే పరిస్థితులు కనిపించాయి.



తినడం కష్టం... తిన్నామా నష్టం!

- రైళ్లలో ఆహారమా మజాకానా
- నాణ్యత లేమి... కల్తీలమయం
- తనిఖీల్లో తేలుతున్న నిజాలు

ఈనాడు – హైదరాబాద్

ఆహార సరఫరా తీరుపై రైల్వే అధికారులు జులై 26 నుంచి ఆగస్టు 16వరకు వివిధ రైల్వే స్టేషన్లు, రైళ్లలో తనిఖీలు చేపట్టారు. దాదాపు వెయ్యి కేసులు నమోదు చేశారు. వీటిలో సగానికి పైగా సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లలోనివే. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఆగిన ప్రతి బండినీ పరిశీలించగా ప్రయాణికులు ఎలా దోపిడీకి గురయ్యారో తేలింది. పరిశుభ్రత పాటించకపోవడం, పరిమాణం తక్కువగా ఉండటం, నాణ్యత లేకపోవడం.. పాడైపోవడానికి సిద్ధంగా ఉన్న ఆహారం అందించడం... ఇలా గుత్తేదారులు నిబంధనలు ఉల్లంఘించిన తీరు కళ్లకు కట్టాయి. ఇవన్నీ ఒకెత్తయితే ఎవరుపడితే వారు ఇళ్లలో, కాకా హోటళ్లలో వండిన పదార్థాలను తీసుకువచ్చి అమ్మేస్తున్నారు. అటు అమ్మకం దారులకు, ఇటు గుత్తేదారులకు రూ. లక్షల్లో అధికారులు జరిమానాలు విధించారు.

నిర్లిప్తంగా వ్యవహరిస్తే అంతే..

రైళ్లలో సరఫరా అవుతున్న ఆహారం గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిదని కొంతమంది సరిపుచ్చుకుంటారు. రోజూ తింటామా? ప్రయాణం సాఫీగా సాగిపోతే అదే పదివేలు అని భావిస్తుంటారు. సరిగ్గా ఇటువంటి నిర్లిప్త ధోరణే ఇప్పుడు రైళ్లలో భోజనాలు పెట్టేవారికి వరమవుతోంది. నాసిరకం ఆహారం ప్రయాణికులకు అందుతోంది. జులై 25న రాజధాని ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులు ఇటువంటి ఆహారంతో సర్దుకుపోలేదు. హజ్రత్ నిజాముద్దీన్(దిల్లీ) నుంచి బెంగళూరు వెళ్లే ఈ ప్రయాణికులు సికింద్రాబాద్‌లో రైలును గంటసేపు ఆపి ఆందోళనకు దిగారు. అధికారులు రంగంలోకి దిగి సర్దుబాటు చేశారు. ఇటీవల కాచిగూడ రైల్వే స్టేషన్‌లో క్యాంటీన్‌లో కొన్న ఆహారంలో బొద్దింక కనిపించింది. ఈ నేపథ్యంలో ఆహారం ఎలా ఉండాలనేదానిపై అందరిలో చర్చ జరుగుతోంది. దాదాపు 97 పదార్థాలకు స్టేషన్లలో విక్రయించాల్సిన ధర, రైళ్లలో అందించాల్సిన ధరలను రైల్వేబోర్డు నిర్ణయించింది. వాటిలో కొన్నింటి పరిమాణం, ధరలు ఇలా ఉన్నాయి. వీటికి 18 శాతం జీఎస్టీ వర్తిస్తుంది.

934
దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 22 రోజుల్లో నమోదైన కేసులు

రూ.7.30లక్షలు
అమ్మకందారులకు విధించిన జరిమానా

రూ.9.04లక్షలు
గుత్తేదారులకు విధించిన జరిమానా

పరిమాణం	క్యాంటీన్‌లో ధర(రూ.లలో)	రైళ్లలో
2 ఇడ్లీలు(60గ్రా),చట్నీ/సాంబారు(40గ్రా)	12.00	14.00
2 మసాలావడలు(60గ్రా), చట్నీ(40గ్రా)	16.00	18.00
లీటరు తాగునీటి సీసా	15.00	15.00
రెండు వడలు(60గ్రా), పెరుగు(100గ్రా)	14.00	16.00
రెండు సమోసాలు(60 గ్రా.), సాస్/చట్నీ	16.00	18.00
టమోటా సూప్(150ఎంఎల్), మిరియాల పొడి	15.00	18.00
వెజ్ బిర్యానీ/పలావు (200గ్రా)	42.00	49.00
200 గ్రాముల వెజ్ ఫ్రైడ్‌రైస్	32.00	37.00

ఫిర్యాదు చేయండి

రైల్వే బోర్డు నిర్ణయించిన ధరలు నాలుగైదేళ్ల క్రితానివి అయినప్పటికీ.. ఆ నిబంధనల ప్రకారమే ఆహారం సరఫరా చేస్తామని ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలు ఇప్పుడు పట్టించుకోవడం లేదు. రెట్టింపు ధరలకు అమ్మేస్తున్నారు. ఫిర్యాదులందినా అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. ప్రతి ఆహార ప్యాకెట్‌పైనా సరఫరా చేస్తున్న సంస్థ పేరు.. రిజిస్టర్ నంబరు.. ఎన్ని గ్రాములు ఉంది తదితర వివరాలతో పాటు తేదీ ఉండాలి. సరఫరా కాంట్రాక్టు పొందిన సంస్థలు కొంతమంది ప్రైవేటు వ్యక్తులను ప్రోత్సహించగా.. మరికొందరు అనుమతి లేకుండానే విక్రయిస్తున్నారు. ఇలాంటి సమస్యలపై 1800111321, 18004255090 టోల్‌ఫ్రీతోపాటు 138 నంబరుకు ఫిర్యాదు చేయొచ్చని రైల్వే వర్గాలు చెబుతున్నాయి.


పది రోజుల్లోనే కట్టేశారు!

- ఒలిఫెంటా దగ్గర మెట్రో స్టీలు వంతెన పూర్తి
- 271 అడుగుల దూరం స్పాన్ బిగింపు

ఈనాడు, హైదరాబాద్

మెట్రోరైలు పనుల్లో మరో ఇంజినీరింగ్ సవాల్‌ను నిర్మాణ సంస్థ విజయవంతంగా అధిగమించింది. ఒలిఫెంటా రైల్వే వంతెనపై మెట్రో రైలు స్టీలు బ్రిడ్జి శనివారం తెల్లవారుజామున సురక్షితంగా పట్టాలు దాటించి, స్తంభాలపై బిగించారు. నాగోల్ నుంచి మెట్టుగూడ వరకు మెట్రో రెండేళ్ల క్రితమే పూర్తయింది. అయినా సికింద్రాబాద్ వరకు అనుసంధానానికి ఒలిఫెంటా ఆర్వోబీ ప్రధాన అడ్డంకిగా ఉండేది. ఇప్పుడు వంతెన పూర్తవడంతో నవంబరు ఆఖరులో ప్రధాని చేతుల మీదుగా మెట్రో ప్రారంభించేందుకు చేస్తున్న పనులు ఊపందుకున్నాయి.

మెట్రో కారిడార్లలో రైల్వే లైన్లపై నిర్మించిన ఆర్వోబీలకు ఒలిఫెంటా పూర్తి భిన్నం. ఇక్కడ దాదాపు 83 మీటర్ల దూరం మధ్యలో ఎలాంటి మద్దతు లేకుండా ఆర్వోబీ నిర్మించాల్సి వచ్చింది. అందుకే స్టీలు వంతెనను ప్రతిపాదించారు. ఈ స్టీలు వంతెనను ఉత్తరప్రదేశ్ జిల్లా ఘజియాబాద్‌లో తయారు చేయించారు. అనంతరం భాగాలుగా విడదీసి హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. ఇక్కడ ఒలిఫెంటా బ్రిడ్జి సమీపంలోని రైల్వే స్థలంలో కొద్దినెలలుగా విడి భాగాలను కలుపుతూ వంతెన తయారు చేశారు. దీన్ని ఒలిఫెంటా బ్రిడ్జికి అటుఇటు 272 అడుగుల దూరంలో నిర్మించిన స్తంభాలపైకి సురక్షితంగా చేర్చారు. 1,100 టన్నుల బరువు, 57 అడుగుల వెడల్పు, 35 అడుగుల ఎత్తులో ఎలాంటి ప్రమాదాలకూ ఆస్కారం లేకుండా విజయవంతంగా బిగించారు. రైల్వే అనుమతి ఇచ్చిన అర్ధరాత్రి వేళల్లో కొద్ది రోజులుగా జాక్స్, క్రేన్లు, విదేశాల నుంచి ప్రత్యేకంగా దిగుమతి చేసుకున్న రోలర్ల సహాయంతో అడుగు అడుగు జరుపుతూ శనివారం ప్రక్రియను పూర్తి చేశారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ముందు జాగ్రత్తగా ఆ మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.



మెట్రో స్టీలు వంతెన కిందుగా వెళ్తున్న రైలు

272 అడుగులు	స్పాన్ పొడవు (ప్రధాన వంతెన)
60 అడుగులు	రహదారి నుంచి ఎత్తు
42 అడుగులు	రైలు ట్రాక్ నుంచి ఎత్తు
656 అడుగులు	స్టీలు వంతెన పొడవు
100 టన్నులు	తోసే జాక్ సామర్థ్యం
400 టన్నులు	పైకి ఎత్తే లిఫ్టింగ్ సామర్థ్యం

సరికొత్త రికార్డు - ఎన్వీఎస్‌రెడ్డి, ఎండీ, హెచ్‌ఎంఆర్

స్టీలు వంతెనలను నదులు, కొండల్లో నిర్మిస్తుంటారు. అక్కడ జన సంచారం ఉండదు కాబట్టి నిర్మాణం సులువే. రద్దీగా ఉండే సికింద్రాబాద్ వంటి చోట్ల ఎంతో క్లిష్టం. అయినా 10 రోజుల్లోనే పూర్తి చేయడం సరికొత్త రికార్డు. మరో 15 రోజుల్లో స్టీలు వంతెనను వయడక్ట్‌తో కలిపి ట్రాక్ పనులు పూర్తిచేస్తాం.

నెల రోజుల్లో గుర్తింపు కబురు?!

- వర్సిటీల్లో ముగిసిన న్యాక్‌బృందాల పర్యటన
- సానుకూలంగా సాగిన పరిశీలన
- మంచి గ్రేడ్ వస్తుందంటున్న వీసీలు



జేఎన్‌టీయూహెచ్‌లో పర్యటిస్తున్న న్యాక్ బృందం

ఈనాడు, హైదరాబాద్: జేఎన్‌టీయూహెచ్, ఉస్మానియా విశ్వవిద్యాలయాలకు ఎట్టకేలకు న్యాక్ గుర్తింపు దక్కనుంది. గత కొన్నేళ్లుగా ఈ రెండు వర్సిటీలకు న్యాక్ గుర్తింపు లేని విషయం విదితమే. కారణాలు ఏమైనా ఈ విశ్వవిద్యాలయాలకు న్యాక్ గుర్తింపు లేకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారు. రాష్ట్రంలో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఈ వర్సిటీలకు ఇన్నేళ్లపాటు గుర్తింపు లేకుండా సాగడం పలు విమర్శలకు దారితీసింది. వర్సిటీతోపాటు విద్యార్థులు ఆర్థికంగా బాగా నష్టపోయారు. 2004లో జేఎన్‌టీయూకి న్యాక్(నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్)ఏ గ్రేడ్ దక్కింది. ఆ తర్వాత 2008లో ఈ వర్సిటీ నాలుగ్గా విడిపోయింది. ఒకటి జేఎన్‌టీయూహెచ్‌గా ఆవిర్భవించింది. 2004లో దక్కిన గుర్తింపు 2009లో పూర్తిఅయింది. వర్సిటీ కొత్తగా ఆవిర్భవించిన నేపథ్యంలో మళ్లీ న్యాక్ గుర్తింపు కొత్తగా పొందాల్సి వచ్చింది. అప్పటి నుంచి గుర్తింపు పొందేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. వీసీగా ఎ.వేణుగోపాల్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి గుర్తింపుపై మళ్లీ దృష్టిపెట్టారు. ఆయావిభాగాల అధికారులను అప్రమత్తం చేశారు. వర్సిటీలో మౌలిక వసతులు కల్పించారు. వీటితోపాటు సీబీసీఎస్, క్రెడిట్స్ విధానాలను అమలులోకి తెచ్చారు. సెమిస్టర్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. బయోమెట్రిక్ హాజరును ఉద్యోగులకు అమల్లోకి తెచ్చారు. ఇవన్నీ గుర్తింపు పొందేందుకు కలిసొచ్చే అంశాలే. ఇదేతీరులో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి గుర్తింపు పొందేందుకు పలు అంశాలు దోహదం చేస్తున్నాయి. ఓయూ వీసీగా బాధ్యతలు చేపట్టిన ఎస్.రామచంద్రం.. ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించారు. విద్యాప్రమాణాలు మెరుగుపరిచేందుకు చాలా కసరత్తు చేశారు. శతాబ్ది ప్రారంభోత్సవాల నాటికి ఈ గుర్తింపు సాధించాలని ఎంతో ప్రయత్నం చేశారు. ఈయన బాధ్యతలు స్వీకరించిన తర్వాత తక్కువకాలంలోనే ఈ ప్రారంభోత్సవాలు రావడంతో 'గుర్తింపు' సాధ్యంకాలేదు.

ప్రశాంతంగా మూడురోజుల పర్యటన

ఉస్మానియా, జేఎన్‌టీయూహెచ్‌ల్లో న్యాక్ బృందాలు ఈనెల 17 నుంచి మూడు రోజులపాటు విస్తృతంగా పర్యటించాయి. 17వ తేదీ ఉదయం నుంచి ప్రారంభమైన ఈ బృందాల పరిశీలన శనివారం సాయంత్రం వరకు అదే జోరుగా సాగింది. ఈ మూడు రోజుల్లో ఆయా విభాగాలను న్యాక్ బృంద సభ్యులు నిశితంగా పరిశీలించారు. జేఎన్‌టీయూహెచ్‌లో న్యాక్ బృందంలో ఉన్న ఆరుగురు సభ్యులు, ఉస్మానియాలో తొమ్మిది మంది సభ్యులున్నారు. వీరంతా పలు బృందాలుగా విడిపోయి వర్సిటీల్లోని దాదాపు అన్ని విభాగాలను సందర్శించారు. ఆయా విభాగాలు ఎంతకాలం నుంచి వర్సిటీల్లో ఉన్నాయో ఆరా తీశారు. వాటి బడ్జెట్ వివరాలు, చేస్తున్న కార్యకలాపాలు తదితరాల గురించి ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి వసతులను నేరుగా వీక్షించారు. పర్యటన ప్రారంభం నుంచి చివరి వరకు ప్రతి సంఘటనను సంబంధించి చిత్రాలు, వీడియోలను తీయించారు. మూడు రోజుల న్యాక్ బృందాల పర్యటన అంతా ప్రశాంతంగా సాగింది.

గ్రేడ్‌పై వీడని ఉత్కంఠ..

వర్సిటీల వీసీలు, అధికారులు న్యాక్ నుంచి మంచి గ్రేడ్ వస్తుందని ఆశిస్తున్నారు. ఈ గుర్తింపు నెల రోజుల్లోనే రావచ్చని పేర్కొన్నారు. న్యాక్‌లో ఏ, ఏప్లస్, ఏప్లస్‌ప్లస్ గ్రేడుల్లో ఏది దక్కుతుందో వేచిచూడాల్సిందే. ప్రస్తుతం వర్సిటీల్లోని పరిస్థితుల రీత్యా రెండు వర్సిటీలకు 'ఏ లేదా ఏ ప్లస్' గ్రేడులే దక్కవచ్చని విద్యారంగ నిపుణులు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ రెండు వర్సిటీల్లో చాలా దీర్ఘకాలిక సమస్యలున్నాయని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా వీటిపై అవి దృష్టిపెట్టలేకపోయాయని వారు పేర్కొన్నారు. ఇదిఒక్కటే మంచి గ్రేడ్‌లు దక్కేందుకు ప్రతికూల అంశమైందన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు మాత్రం గ్రేడు ఏది వస్తుందనే ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.

సానుకూల అంశాలే ఎక్కువ..

జేఎన్‌టీయూహెచ్, ఉస్మానియా విశ్వవిద్యాలయాలకు న్యాక్ గుర్తింపు దక్కే తరుణం ఆసన్నమైంది. వీటిల్లో చాలా సమస్యలకు పరిష్కారం లభించింది. నిధుల లోటు కారణంగా దీర్ఘకాలిక సమస్యలు మాత్రం అలాగే ఉండిపోయాయి. న్యాక్ బృందం వచ్చేలోపు అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఉస్మానియా అధికారులు ప్రయత్నించినా నిధుల సమస్య వెంటాడింది. జీతాలు సకాలంలో ఇవ్వడానికే ఇబ్బందిపడిన పరిస్థితి నుంచి గట్టెక్కినా.. అభివృద్ధి పనులకు సమృద్ధిగా నిధులు లేవనే చెప్పాలి. ప్రభుత్వం ప్రకటించిన రూ. 200 కోట్లులో రూ.50 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. మిగతా నిధులు వచ్చిఉంటే వర్సిటీలో మరిన్ని పనులు పూర్తయ్యేవి. శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో వేసిన రహదారులు, భవనాలకు రంగులు వంటి పలు కార్యక్రమాలు న్యాక్ గుర్తింపు పొందేందుకు కలిసొచ్చాయనే చెప్పాలి. వసతిగృహాలు మెరుగుపడ్డాయి. రహదారులు, భవనాలు ఆకర్షణీయంగా రూపుదిద్దుకున్నాయి.



తిరుమలగిరి ఒకప్పటి జైలు భవంతి విహంగ వీక్షణం

చూసేందుకు ఏదీ వీలు?

- విశిష్ట భవన సముదాయం సందర్శనకు అనుమతివ్వని రక్షణ శాఖ
- అండమాన్ కారాగారాన్ని పోలి ఉండే శైలి
- కంటోన్మెంట్ తిరుమలగిరిలో సైనిక శిక్షణా భవంతి

అల్వాల్, న్యూస్‌టుడే

అదో అద్భుత కట్టడం... అలనాడు క్రమశిక్షణ తప్పిన సైనికులను సన్మార్గంలో పెట్టేందుకు ఉపయోగపడిన భవనం... చారిత్రక, కళాత్మక వారసత్వ కట్టడాల్లో ఒకటిగా వెలుగొందుతున్న ఆ భవనమే తిరుమలగిరి జైలు. ఒకప్పుడు ఖైదీల్లో సత్ప్రవర్తనను పెంపొందించేందుకు ఉపయోగించిన ఈ జైలు ప్రస్తుతం సైన్యం శిక్షణ యూనిట్‌గా ఉపయోగపడుతోంది. అలనాటి జ్ఞాపకాలకు మూగసాక్షిగా ఉంది. ఇంతటి విశిష్టతను కలిగిన ఈ జైలు సందర్శనపై ప్రతిష్టంభన మాత్రం నెలకొంది. ఒకప్పుడు ప్రత్యేక సందర్భాల్లో జైలు సందర్శనకు అనుమతి ఇచ్చేవారు. కానీ ఆ తర్వాత సైన్యం నిషేధాజ్ఞల నేపథ్యంలో సందర్శనను నిలిపి వేశారు. కనీసం స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవం రోజుల్లోనైనా సందర్శనకు అనుమతి ఇవ్వాలని కోరుతున్నా కేంద్ర రక్షణ శాఖ స్పందించడం లేదు.

'కాలాపానీ' క్రూరత్వం ఇక్కడ..

'కాలాపానీ' అనగానే అండమాన్ దీవుల్లోని జైలులో బ్రిటిష్ కాలంలో స్వాతంత్ర్య సమరయోధుల దీరగాథలు... కఠినంగా, క్రూరంగా, పాశవికంగా వ్యవహరించిన అంశాలు గుర్తుకు వస్తాయి. ఆ జైలును కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రదర్శనశాలగా ప్రకటించింది. అలాంటి జైలే మన హైదరాబాద్‌లో ఉంది. ఈ జైలులో బ్రిటిష్ సైన్యంలో తప్పులు చేసిన వారిని ఉంచేవారు. కొందరిని ఉరికూడా తీశారు. 1858లోనే దీన్ని నిర్మించారు. ఈ జైలును చూసే అండమాన్ దీవుల్లో కాలపానీని 1906లో నిర్మించినట్లు చెబుతారు. ఈ జైలకు అప్పట్లో బ్రిటిష్ వారు రూ. 4.71 లక్షలు వ్యయం చేసినట్లు రికార్డులు ఉన్నాయి.

చెక్కతో మెట్లు



మొత్తం నాలుగు దిక్కుల్లో 128 మందిని బందించేందుకు వీలుగా గదులు ఉన్నాయి. ఇందులో 75 చీకటి గదులు(సెల్) ఉన్నాయి. ప్రతి గదికి ప్రత్యేకమైన చిన్న రంధ్రం ఉంటుంది. ఇందులో నుంచి ఖైదీ బయటకు చూస్తే ఎదురుగా ఉన్న వారు మాత్రమే కనిపిస్తారు. గది మొత్తం చీకటిగా ఉంటుంది. నాలుగు దిక్కులను కలిపే మధ్య భాగాన్ని రెండు అంతస్తులకే పరిమితం చేయకుడా మరింత ఎత్తుగా నిర్మించారు. చెక్కతో నిర్మించిన మెట్లు ఉన్నాయి.


ఖైదీలను బంధించిన గదులు

ఉరి తప్పితే.. బావిలో!

మధ్యభాగంలో బయటికి కోటగా కనిపించే భాగమే ఖైదీలను ఉరితీసే ప్రాంతం. 40 అడుగుల కంటే ఎత్తులో ఉరి వేస్తారు. ఏకారణం చేతనైనా ఉరితప్పినా నేలపై వ్యక్తి పడే ప్రాంతంలో ఇనుపరాడ్లతో ఏర్పాటు చేసిన చిన్న బావి ఉంటుంది. ప్రస్తుతం దానిని మూసివేశారు.

'పచ్చీస్' ఆట ఆకారం

తిరుమలగిరి చౌరస్తాలో నిలబడి చూస్తే కోటను తలపించేలా కనబడే కట్టడమే తిరుమలగిరి జైలు. 20,344 గజాల్లో రెండు అంతస్తుల్లో ఉంటుంది. తూర్పు. పడమర, దక్షిణం, ఉత్తర దిక్కుల్లో నాలుగు వైపులా సమానంగా ఒకే. .. ఆకృతిలో కట్టడాలను నిర్మించారు. తెల్లని రాతిని కట్టడానికి ఉపయోగించారు. ఆకాశంలో నుంచి చూస్తే 'పచ్చీస్' ఆట ఆకారంలో కనిపిస్తోంది.

ఇష్టదైవం.. ప్రార్థన


నాడు బ్రిటిష్ అధికారులు ఉరిశిక్ష అమలు చేసే సమయంలో మాత్రం ఇష్టదైవాన్ని ప్రార్థించుకొనే అవకాశం కల్పించే వారు. ఓ గదిలో ఇష్టదైవాల చిత్రాలు, మత గ్రంథాలు ఉన్నాయి. మొత్తం 500 మందికి పైన ఉరివేసినట్లు చెబుతారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో కొందరిని బందీగా ఉంచారు. 1984లో పంజాబ్‌లో 'ఆపరేషన్ బ్లూస్టార్' సమయంలో సైనికుల ఆధీనంలోకి వచ్చిన ఖైదీలను కూడా ఈ తిరుమలగిరి జైలులోనే బంధించారు.

వారసత్వ సంపద అవార్డు

1994 వరకు జైలును వినియోగించారు. ఆ తర్వాత టెరిటోరియల్ ఆర్మీ-125 ఇన్‌ఫాంట్రీ బెటాలియన్ శిక్షణ సంస్థ కొనసాగుతోంది. జైలు మధ్యభాగంలోని కోటపై నిత్యం ఎగిరే జాతీయ జెండాను సాయంత్రం కిందికి దించేందుకు, ఉదయం జెండా ఎగురవేసేందుకు ప్రతి రోజూ రెండు సార్లు పైకి సైనికులు ఎక్కుతారు. ఇక్కడినుంచి సైనిక ఆసుపత్రికి సొరంగం ఉంది. ప్రస్తుతం వినియోగంలో లేదు. 1997లో 'ఇంటాక్ సంస్థ' నుంచి వారసత్వ సంపద అవార్డు లభించింది.

అనుమతివ్వాలంటూ డిమాండ్

తిరుమలగిరి జైలును కనీసం ప్రత్యేక సందర్భాల్లోనైనా సందర్శించడానికి అనుమతి కోరుతూ అనేక మంది సికింద్రాబాద్ రక్షణ కార్యాలయాన్ని ఆశ్రయిస్తున్నారు. వీరిలో అధిక శాతం పాఠశాల విద్యార్థులు, పర్యాటకులు ఉన్నారు. కానీ అక్కడి అధికారులు మాత్రం వారి విన్నపాన్ని తిరస్కరిస్తున్నారు. గడిచిన ఆరు సంవత్సరాల నుంచి కంటోన్మెంట్‌లో అమలవుతున్న నిషేదాజ్ఞల నేపథ్యంలో జైలు సందర్శనకు అనుమతి ఇవ్వడం లేదని చెబుతున్నారు. జైలు నిర్వహణ సైనిక అధికారులనే సంప్రదించి అనుమతి కోరవచ్చని తెలిపారు. మ్యూజియంగా మార్చాలంటే మాత్రం కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని రక్షణ కార్యాలయం అధికారి వివరించారు.


ఉరి తీసిన ప్రాంతం

రూ.5 కోట్లు	రూ.75 లక్షలు
కొత్త సీటీ స్కాన్	డిజిటల్ ఎక్స్‌రే విభాగం
రూ.26 లక్షలు	
విభాగం సుందరీకరణకు	

రేడియాలజీ విభాగంలో సమకూరిన యంత్రాలు



ఒక్కొక్కటిగా కార్పొరేట్ సదుపాయాలను సమకూర్చుకుంటున్న గాంధీ ఆసుపత్రికి మరో విభాగం తోడు కానుంది. ఇప్పటికే శీతలీకరణతో కూడిన అత్యాధునిక సదుపాయాలతో 65 పడకల ఐసీయూ వార్డుకు శ్రీకారం చుట్టిన పాలన యంత్రాంగం అదే తరహాలో వైద్యపరీక్షలు అందించేందుకు అవసరమైన రేడియాలజీ విభాగాన్ని కూడా సుందరీకరించింది. అదనంగా సీటీ స్కాన్, డిజిటల్ ఎక్స్‌రే విభాగాన్ని ఏర్పాటు చేశారు. రూ.5.75 కోట్లతో ఈ యంత్రాలను కొనుగోలు చేశారు. మొన్నటి వరకు అరకొర వసతులు, అస్తవ్యస్త పరిస్థితుల నడుమ ఉన్న ఆ విభాగం ప్రస్తుతం ఆధునికంగా దర్శనమిస్తోంది. కొత్త ఐసీయూ ప్రారంభం సమయంలోనే ఈ విభాగాన్ని గవర్నర్ నరసింహన్ ప్రారంభించారు.

రేడియాలజీ కొలువు.. పడిగాపులకు సెలవు!

- 'గాంధీ'లో ఆధునికీకరణ సంతరించుకున్న విభాగం
- కొత్తగా సీటీ స్కాన్, డిజిటల్ ఎక్స్‌రే యంత్రాలు

న్యూస్‌టుడే, గాంధీ ఆసుపత్రి

గాంధీ ఆసుపత్రిలో ప్రస్తుతం సీటీ స్కాన్ వైద్య పరీక్షలు చేయించుకోవాలంటే సాధారణ రోగులకు రెండు వారాల నుంచి రెండు నెలల వరకు సమయం పడుతోంది. ఆసుపత్రికి వచ్చిన అత్యవసర రోగులతోపాటు, ఇన్‌పేషెంట్లుగా చేరే వారికి ఈ పరీక్షలకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. వీరే కాకుండా బయటి నుంచి కూడా రోగులు ఈ పరీక్షల కోసం వస్తుంటారు. ఎందుకంటే బయట ఉన్న డయాగ్నస్టిక్స్ కేంద్రాల్లో సీటీ స్కాన్‌కు రూ. 6 వేల నుంచి రూ. 7 వేల వరకు వసూలు చేస్తుంటారు. గాంధీ ఆసుపత్రిలో అయితే రూ. 3 వేల నుంచి రూ. 4 వేల వరకు మాత్రమే తీసుకుంటారు. ఆసుపత్రిలో చేరిన రోగికి ఆరోగ్యశ్రీ పథకం వర్తిస్తే ఉచితంగా, ఒక వేళ తెల్లరేషన్ కార్డు ఉంటే రూ. 500 చెల్లించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వాస్తవానికి సీటీ స్కాన్ పరీక్షలు రోజుకు కేవలం 20 నుంచి 30 వరకు మాత్రమే చేసే వెసులుబాటు ఉంది. ఆసుపత్రిలో చేరిన అత్యవసర రోగులతోపాటు, బయటి అత్యవసర రోగులు కూడా అప్పుడప్పుడు వస్తున్న క్రమంలో ఒక్కోసారి నలభై మంది వరకు పరీక్షలు నిర్వహించక తప్పని పరిస్థితులు ఎదురవుతుంటాయి. 'గాంధీ'లో పదేళ్ల కిందట ఏర్పాటు చేసిన ఈ సీటీ స్కాన్ తరుచూ మరమ్మతులకు గురవుతోంది. అటువంటి సమయంలో అత్యవసర రోగులను ఉస్మానియా ఆసుపత్రికి తరలించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇదివరకున్న సీటీ స్కాన్‌కు అదనంగా ఇంకోటి అందుబాటులోకి రావడంతో ఇకనుంచి ఆసుపత్రి రోగులతోపాటు బయటి రోగులకు రోజుకు ఎంతలేదన్నా కనీసం అరవైకి పైగా రోగులకు స్కానింగ్ చేసే అవకాశాలున్నాయి. ఈ అవకాశం అందుబాటులోకి వస్తున్నందున బయటి రోగులకు చేసే స్కానింగ్‌ల ద్వారా ఆసుపత్రికి ఆదాయం లభించే అవకాశంతోపాటు ఇంతకుముందులా రోగులు నెలల తరబడి నిరీక్షించే అవకాశాలుండవని ఆసుపత్రి పాలనాయంత్రాంగం అభిప్రాయపడుతోంది.


నూతన హంగులతో డిజిటల్ ఎక్స్‌రే విభాగం

ఆధునిక సదుపాయాలు, యంత్రాలు

– శ్రావణ్‌కుమార్, సూపరింటెండెంట్, గాంధీ ఆసుపత్రి

గాంధీ ఆసుపత్రిలో కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా సౌకర్యాలు కల్పిస్తున్నాం. తాజాగా అత్యవసర విభాగంలో 65 పడకలతో ఏర్పాటు చేసిన అధునాతన ఐసీయూ వార్డు తరహాలోనే రేడియాలజీ విభాగాన్ని కూడా ఆధునికీకరిస్తున్నాం. తదనుగుణంగా సదుపాయాలు, యంత్రాలు, సౌకర్యాలను కల్పించుకున్నాం.

ప్రతిభ

TENTH English

PREPOSITIONS

It goes without saying that language is the dress of thought. As such, we express our feelings and thoughts through words. The words we use in a sentence need to be precise, accurate and forceful. So to say, prepositions are such forceful, nay powerful words which govern the entire sentence. Therefore, a thorough practice of using correct prepositions is needed for the learner.

Nithin is fond *of* eating..

A Preposition is a word such as in, on, at or beside that is used before a noun or a noun phrase or a pronoun to show a link with another word or phrase.

★ Study the prepositions under lined in the following sentences:

1. Vaccination protects us <u>from</u> many diseases.
2. A man is known <u>by</u> the company the keeps.
3. Foundation of a house lies <u>below</u> the ground level.
4. Srinidhi has no appetite <u>for</u> sweets.

The words from, by, below and for are prepositions.

Kinds Of Prepositions

Prepositions have different functions: to indicate time, place, movement, direction, means, manner, purpose, source, concession, etc.

Examples: 1. The train arrived <u>on</u> time. (Time)
2. I met Sahithi <u>at</u> the theatre. (Place)
3. Shirisha went to the market <u>for</u> fruits. (Purpose)
4. Rishita drove <u>along</u> the main road in a hurry. (Direction)

A. Simple Prepositions: in ★ on ★ at ★ to ★ for ★ from ★ of ★ off out ★ by ★ till ★ with ★ through, etc.

Study the following sentences and observe the prepositions used in each sentence and note the function of the prepositions given in the brackets.

1. Vaishnavi waited for the doctor <u>till</u> he returned. (Time)
2. Naveen left Boath <u>for</u> Dubai. (Place)
3. <u>Inspite of</u> the hurdles, Kavya succeeded in her efforts. (Concession)

B. Compound Prepositions

about ★ above ★ across ★ along ★ amidst ★ among ★ around ★ before ★ behind ★ below ★ beneath ★ beside ★ between ★ beyond ★ inside ★ out side ★ within ★ with out

Examples: 1. A narrow path ran in <u>between</u> the two houses.
2. The moon moves <u>around</u> the Earth.
3. <u>Inside</u> the box was a diamond studded watch.
4. I cannot allow the work to continue <u>beyond</u> the end of December.

Exercise - 1

✪ *Fill in the blanks with suitable Simple Prepositions.*

1. Nithin is fond .... eating sweets.
2. English is quite different .... Telugu.
3. Malavika fell ... her bicycle and broke her leg.
4. Ashwini drove her car .... the side gate.
5. I'll return your book .... a week.

Exercise - 2

✪ *Fill in the blanks with suitable Compound prepositions.*

1. Apple and banana are .... the most popular fruits.
2. Moiz usually sits .... Saikumar in the class.
3. There is something special .... our Headmaster.
4. A new bridge is being built .... the river.
5. She looks nice .... make-up.

C. Compound Prepositional Phrases

Compound Prepositional Phrases consist of two or more words, such as due to, because of, together with, etc.

Examples:

1. The rowdy was arrested <u>according to</u> IPC 420.
2. I cannot see the film because a tall man is sitting <u>infront of</u> me.
3. Vijayendra Prasad goes to school <u>along with</u> Vamsi Krishna daily.
4. Ring the alarm bell <u>in case of</u> emergency.

✪ *Study the following compound Prepositional Phrases and note the meanings given to each of them*

Comp.Prep.Phrases	Meanings
along with	together with
on account of	because of
by means of	through the agency of
apart from	separate from
ahead of	earlier than something/ somebody
in front of	located before
in place of	as a substitute for
inspite of	disregarding the difficulty
in case of	in the event of
by way of	via
due to	on account of
for the sake of	for the good of
in addition to	added to
in accordance with	in agreement with

Examples: The thief entered the house <u>by means of</u> a broken window.
2. Shruthi attends special classes on Sundays <u>in addition to</u> regular practice.
3. We postponed our trip to Ramoji Film City <u>due to</u> bad weather.
4. <u>Inspite of</u> being rich, my neighbour is not happy.

Exercise - 3

✪ *Fill in each blank with the correct Compound Prepositional Phrases from those given under each sentence.*

1. .... his injury, Umesh will play in Sunday's match.
   a) Due to b) For the sake of c) In spite of
2. He sent me some flowers .... an apology.
   a) by way of b) in case of c) apart from
3. Is there parking space .... the hotel?
   a) ahead of b) in front of c) along with
4. She lost her way when she went into the jungle .... firewood.
   a) for the sake of b) in addition to c) in search of

Answers

Ex-1: 1) of 2) from 3) off 4) through 5) in
Ex-2: 1) among 2) beside 3) about 4) across 5) without
Ex-3: 1-c 2-a 3-b 4-c.



రచయిత
డి.నారాయణ,
విషయ నిపుణులు

జనరల్ స్టడీస్

ఫిజిక్స్

గాలిలో ధ్వని వేగం దేనిపై ఆధారపడదు?

1. ఒక వాహనం తన ప్రయాణ దూరంలోని మూడు సమ దూరాలను వరుసగా 80, 60, 30 కి.మీ. / గంట వేగంతో ప్రయాణిస్తే దాని సగటు వేగం ఎంత? (కి.మీ./గంటల్లో)
1) 60 2) 50 3) 48 4) 24

2. ఖగోళశాస్త్రంలో 'పార్‌సెక్' దేనికి ప్రమాణం?
1) దూరం 2) కాలం 3) వేగం 4) పౌనఃపున్యం

3. ట్రాన్స్‌ఫార్మర్ మార్చలేని AC విద్యుత్‌కి సంబంధించిన అంశం?
1) వోల్టేజీ 2) కరెంట్ 3) పౌనఃపున్యం 4) పైవన్నీ

4. భూస్థావర (జియోస్టేషనరీ) ఉపగ్రహం భూమి కేంద్రం నుంచి సుమారు ఎంత ఎత్తులో ఉంటుంది?
1) 36000 కి.మీ. 2) 6,400 కి.మీ.
3) 21,000 కి.మీ. 4) 42,400 కి.మీ.

5. రేడియో రిసీవర్లలో ఉపయోగించే వలయం ఏది?
1) శుద్ధ నిరోధ వలయం 2) LC - ట్యాంక్ వలయం
3) శుద్ధ ప్రేరక వలయం
4) శుద్ధ కెపాసిటర్ వలయం

6. టెఫ్లాన్ పూత పూసిన లోహ పరికరాలను ఉపయోగించి అధిక వోల్టేజీ విద్యుత్ ప్రసారాలను నిలిపివేయకుండానే వాటిని తీసుకుని వెళ్లే తీగలను ముట్టుకుంటారు. ఎందుకంటే టెఫ్లాన్ ఒక...
1) విద్యుత్ బంధకం 2) అర్ధ వాహకం
3) విద్యుత్ వాహకం 4) అతివాహకం

7. గాలిలో ధ్వని వేగం దేనిపై ఆధారపడదు?
1) పీడనం 2) ఆర్ద్రత
3) గాలి (పవన) వేగం 4) ఉష్ణోగ్రత

8. ప్రతిపాదన **(A):** పాలీవినైల్ క్లోరైడ్‌తో తయారైన రెయిన్ కోట్లను వర్షం నీరు తడపదు.
కారణం (R): పాలీవినైల్ క్లోరైడ్, నీటి మధ్య స్పర్శ కోణం 90° కంటే ఎక్కువ.
1) A, R రెండూ సరైనవి. A కి R సరైన వివరణ.
2) A, R రెండూ సరైనవి. A కి R సరైన వివరణ కాదు.
3) A, R రెండూ సరైనవి కావు.
4) A సరైంది. కానీ, R సరైంది కాదు.

9. శక్తి నిత్యత్వ నియమానికి ప్రతిరూపం -
1) లెంజ్ నియమం
2) ఉష్ణగతిక శాస్త్ర మొదటి నియమం
3) కిర్కాఫ్ రెండో నియమం 4) పైవన్నీ

10. శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతకు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
1) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను చేరిన వాయువు ఘన పరిమాణం శూన్యం అవుతుంది.
2) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను చేరిన వాయువు పీడనం శూన్యం అవుతుంది.
3) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను పొందడం అసాధ్యం.
4) పైవన్నీ సరైనవే

11. కేంద్రక బలాలు....
1) ఆకర్షణ బలాలు 2) స్వల్ప అవధి బలాలు
3) అత్యంత బలమైన బలాలు 4) పైవన్నీ

12. రాకెట్ ఏ సూత్రం ఆధారంగా పని చేస్తుంది?
1) ద్రవ్యరాశి నిత్యత్వ నియమం
2) శక్తి నిత్యత్వ నియమం
3) ద్రవ్యవేగ నిత్యత్వ నియమం 4) పైవన్నీ

13. ఉష్ణశక్తిని విద్యుత్‌శక్తిగా మార్చేది ఏది?
1) థర్మోకపుల్ 2) ఎలక్ట్రిక్ హీటర్
3) ఎలక్ట్రిక్ బల్బు 4) ఫొటో సెల్

14. స్వేచ్ఛగా కిందపడే వస్తువు...
1) మొత్తం యాంత్రిక శక్తి స్థిరం
2) స్థితిజ శక్తి క్రమంగా పెరుగుతుంది



రచయిత
డి. అనంత రామకృష్ణ
విషయ నిపుణులు

3) గతిజ శక్తి క్రమంగా పెరుగుతుంది
4) 1, 3

15. ఎత్తయిన ప్రదేశం (విమానం) నుంచి చూస్తే ఇంద్రధనస్సు ఏ ఆకారంలో కనిపిస్తుంది?
1) అర్ధ వృత్తం 2) వృత్తం
3) పరావలయం 4) ఏదీకాదు

16. 40°C వద్ద ఉన్న 500 మి.లీ. నీటిని అంతే పరిమాణంలో, 70°C వద్ద ఉన్న నీటికి కలిపితే ఫలిత ఉష్ణోగ్రత విలువ ఎంత?
1) 110° C 2) 55°C 3) 40°C 4) 65°C

17. ఒక వ్యక్తికి సరైన దృష్టి కోసం డాక్టర్ +2D కటకం వాడమని సలహా ఇచ్చారు. అది ఏ రకమైన కటకం? దాని నాభ్యాంతరం ఎంత?
1) కుంభాకార, 100 సెం.మీ.
2) పుటాకార, 10 సెం.మీ.
3) కుంభాకార, 50 సెం.మీ.
4) పుటాకార, 50 సెం.మీ.

18. కాంతి విరళ యానకం నుంచి సాంద్రతర యానకంలోకి ప్రసరిస్తే, దాని తరంగదైర్ఘ్యం (λ), పౌనఃపున్యం (υ) విలువలు ఏ విధంగా ఉంటాయి?
1) λ, υ రెండూ పెరుగుతాయి
2) λ పెరుగుతుంది, υ స్థిరం
3) λ తగ్గుతుంది, υ స్థిరం
4) λ, υ రెండూ తగ్గుతాయి

19. వస్తువు గతిజ శక్తి వేటిపై ఆధారపడుతుంది?
1) ద్రవ్యరాశి, ఎత్తు 2) వేగం, కాలం
3) ఎత్తు, త్వరణం 4) ద్రవ్యరాశి, వేగం

20. సమ వేగంతో వెళ్లే వస్తువు ....
1) చలన దిశ స్థిరం, వడి అస్థిరం
2) వడి స్థిరం, చలన దిశ అస్థిరం
3) వడి, చలన దిశ రెండూ అస్థిరం
4) వడి, చలన దిశ రెండూ స్థిరం

21. మానవుడి గుండె సగటున నిమిషానికి 75 సార్లు కొట్టుకుంటుంది. అయితే దాని స్పందన పౌనఃపున్యం ఎంత? (హెర్ట్జ్‌లలో)
1) 1.25 2) 3.25 3) 4.25 4) 2.25

22. R నిరోధం ఉన్న n నిరోధాలను సమాంతరంగా కలిపితే, ఫలిత నిరోధం...
1) nR 2) n^2 R 3) $\frac{R}{n^2}$ 4) $\frac{R}{n}$

23. వర్షాకాలంలో రోడ్లపై నూనె పొరలు రంగుల్లో కనిపించడానికి కారణం?
1) ధ్రువణం 2) వ్యతికరణం
3) పరిక్షేపణం 4) విక్షేపణం

24. పౌనఃపున్య మాడ్యులేషన్‌లో (FM) వాహక తరంగం పౌనఃపున్యం దేనికి అనుగుణంగా మారుతుంది?
1) సంకేత తరంగ తక్షణ పౌనఃపున్యం
2) సంకేత తరంగ తక్షణ దశ
3) సంకేత తరంగ తక్షణ కంపన పరిమితి
4) సంకేత తరంగ తక్షణ వేగం

25. నక్షత్రం నుంచి వెలువడే కాంతి క్రమంగా ఎరుపు రంగుకి మారితే, అది దేన్ని సూచిస్తుంది?
1) నక్షత్రం భూమి వైపు రావడాన్ని
2) నక్షత్రం విరామ స్థితిలో ఉండటాన్ని
3) నక్షత్రం భూమికి దూరంగా వెళ్లడాన్ని
4) నక్షత్రం ఉష్ణోగ్రత క్రమంగా తగ్గడాన్ని

జవాబులు

1-3	5-2	9-4	13-1	17-3	21-1	25-3
2-1	6-1	10-4	14-4	18-3	22-4	
3-3	7-1	11-4	15-2	19-4	23-2	
4-4	8-1	12-3	16-2	20-4	24-1	

హాయ్! బుజ్జీ!!

ఎదుటివారిని చూసి ప్రేమ పూర్వకంగా నవ్వగలిగితే అదే మనం వారికిచ్చే అందమైన బహుమతి

– మదర్ థెరెసా

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Produce = ఉత్పత్తిచేయు
- మధుకరం = తుమ్మెద


సరదా పదాలు

ఆధారాలతో తెలుగు పదాలు రాయండి

1. Summer	వే ☐☐	5. Pay	వే ☐☐
2. Flute	వే ☐☐	6. God	వే ☐☐
3. Speed	వే ☐☐	7. Function	వే ☐☐
4. Heat	వే ☐☐	8. Dawn	వే ☐☐

- డీ దయామతి, హన్మకొండ


దారేది?



చుట్టూ జంతువులు... మధ్యలో మనం!







చిన్నూ కబుర్లు

హాయ్ నేస్తాలూ! బాగున్నారా? నేనీమధ్య ఓ జూ కాని జూకెళ్లొచ్చా. ఊపిరి బిగబట్టుకుని కాలం గడిపొచ్చా. తలుచుకుంటేనే ఈ పర్యటన ఎంతో వింతగా.. గమ్మత్తుగా.. అనిపిస్తోంది. ఆ భలే భలే విశేషాలన్నీ మీతో పంచుకోకుంటే ఎలా? అందుకే ఇలా వచ్చేశా.

చుట్టూ పులులు తిరుగుతుంటే మధ్యలో కూర్చుని భోజనం చేశా. సింహం దగ్గరగా వస్తుంటే కాలు మీద కాలేసుకుని ఐస్‌క్రీంలు తింటూ ఆనందించేశా. జంతువులన్నీ భయంకరంగా అరుస్తుంటే రాత్రివేళ మెత్తని పక్కపై పడుకుని ఓ కునుకేసేశా. 'కోతల రాయుడు కోతలు కోస్తున్నాడు. అన్నీ అబద్ధాలే' అనుకుంటున్నారా? అదేం కాదు. ఇదంతా నిజంగా నిజమే.

* మామూలుగా మనం ఎప్పుడైనా జూకి వెళ్లామనుకోండి. జంతువులన్నీ బోనుల్లో ఉంటాయి. మనం బయట స్వేచ్ఛగా తిరుగుతూ వాటిని చూస్తుంటాం. అంతేకదూ!

* మరి నేనెళ్లిన చోటు మాత్రం దీనికి పూర్తిగా భిన్నం. యూకేలోని కెంట్ దగ్గరుందిది.

* ఓ అద్దాల ఇంట్లో తలుపులేసుకుని నేనుంటే ఆ బయట అంతా పులులు, బోలెడు అడవి జంతువులూ తిరుగుతున్నాయి. లోపల నుంచి దగ్గరగా వాటిని చూస్తూ నేను ఆనందించేసానన్నమాట.

ఒక్కసారైతే నేనున్న అద్దం దగ్గరకి పెద్ద పులి వచ్చేసింది. అప్పుడు చాలా భయమేసి పక్క గదిలో ఉన్న అమ్మ దగ్గరికి పరిగెట్టేశా.

* అసలు ఈ చోటు ఏంటంటే..? ఇదో సఫారీ. మొత్తం 600 ఎకరాల్లో చిక్కగా చెట్లుంటాయి. వాటిలో రకరకాల జంతువులు స్వేచ్ఛగా తిరుగుతుంటాయి.

* మామూలుగా సఫారీల్లో వీటిని చూసేందుకు మనల్ని జీపుల్లాంటివాటిపై ఎక్కించుకుని తిప్పి తీసుకొస్తారంతే. ఇక్కడ అదొక్కటే కాకుండా అద్దాలతో ఉన్న ఓ చక్కని ఇల్లుంది. దాంట్లో రెండు పడకగదులు, వంటిల్లు, హాలూ ఉన్నాయి. ఎవరైనా అద్దెకు తీసుకుని కొన్ని రోజులక్కడ బస చేయొచ్చు. నాలా వింత అనుభవాల్ని ఆస్వాదించొచ్చు. కావాలంటే మీరూ ఓసారి వెళ్లిరండి మరి. బైబై.

నవ్వుల జల్లులు!

టీచర్: రాముా! ఎన్ని సార్లు పిలుస్తున్నా పలకవేంటి?

రాము: మీరే కదా టీచర్ అనవసరమైన విషయాలు పట్టించుకోవద్దన్నారు!

టీచర్: 30 + 30 ఎంత అవుతుంది?

రఘు: ఆరు టీచర్...

టీచర్: కాస్త బుర్ర పెట్టి చెప్పు!

రఘు: నా జవాబు సరైనదే టీచర్. 0కి విలువ లేదని మీరే కదా చెప్పారు!

- బరాటం రామారావు, నిజామాబాద్

చిలిపి ప్రశ్న

నీళ్లు ఎందుకు తాగుతాం?

- జీ రమేష్, పెనుబర్తి

ఏది భిన్నం?



పరివర్తన

కథ

'నాన్నా! రేపు మా తరగతిలోని పిల్లలంతా పరీక్ష ఫీజు చెల్లించాలని హెడ్మాస్టారు చెప్పారు.' ఇంట్లోకి అడుగు పెడుతూనే అన్నాడు రఘు.

అప్పుడే కూలి పని ముగించుకుని ఇంటికి వచ్చిన కేశవులు కొడుకు మాటలు విని 'అలాగా! ఫీజు ఎంతేమిటి?' అని అడిగాడు.

రెండు వందలని మెల్లగా చెప్పాడు రఘు.

'అవునా! రెండు వందలా? ఈ సారి బాగా పెంచేశారే! సర్లే. రేపు బడికి వెళ్లేప్పుడు ఇస్తాలే' అంటూ పెరట్లోకి నడిచాడు కేశవులు.

మరుసటి రోజు ఉదయం రఘు బడికి వెళ్లేందుకు తయారవుతుండగా కేశవులు అతని వద్దకి వచ్చి 'ఇదిగోరా రెండు వందలు. జాగ్రత్త మరి. వెళ్లగానే టీచరుకి ఇవ్వు'. అంటూ జేబులో డబ్బులు పెట్టాడు. 'సరే నాన్నా!' అంటూ బయటకు నడిచాడు రఘు. రఘు కాస్తంత దూరం నడవగానే అతని స్నేహితుడు అమర్ ఎదురయ్యాడు.


'ఏరా మీ నాన్న ఫీజు డబ్బులిచ్చారా?' ఆత్రుతగా అడిగాడు అమర్.

'ఇచ్చార్రా. మరి మీ నాన్నా?' అమర్ కళ్లలోకి సూటిగా చూస్తూ అడిగాడు రఘు.

'నేను ఫీజు రెండు వందల యాభై రూపాయలని చెబితే మారు మాట్లాడకుండా ఇచ్చేశార్రా మానాన్న' గొప్పగా చెప్పాడు అమర్.

ఇంతకీ అసలు విషయం ఏమిటంటే వాళ్లు చెల్లించవలసిన ఫీజు వంద రూపాయలే. తమ తల్లిదండ్రుల నుంచి ఎక్కువ డబ్బు తీసుకుని, వాటితో సినిమాకి వెళ్లాలని పథకం వేసుకున్నారు రఘు, అమర్. ఇద్దరిదీ ఒకే తరగతి. ఒకే బెంచీలో కూర్చుంటారు. కలసి తిరుగుతుంటారు. తల్లిదండ్రుల్ని నమ్మించి భలేగా డబ్బులు తీసుకున్నామని ఇద్దరూ మురిసిపోయారు. చెరో వంద వారి తరగతి ఉపాధ్యాయుడికి ఫీజు చెల్లించారు.

మరునాడు ఆదివారం కావడంతో ఇద్దరూ ఆడుకోవడానికి వెళుతున్నామని చెప్పి టౌనుకు బయలుదేరారు. సినిమా చూసి, ఆ తర్వాత మిఠాయి దుకాణానికి వెళ్లి తమకు ఇష్టమైన తినుబండారాలెన్నో కొనుక్కుని తిన్నారు. ఆనందంగా గడిపారు. చీకటి పడే వేళకు ఇంటికి చేరుకున్నారు. రఘు ఆట నుంచి ఇంటికి వస్తున్నట్లుగా నమ్మించేందుకు ఒక క్రికెట్ బ్యాటు చేతిలో పట్టుకుని



మెల్లగా ఇంట్లోకి అడుగు పెట్టాడు. అదే సమయంలో పక్క గదిలో తల్లిదండ్రులు మాట్లాడుకుంటున్న మాటలు విని ఆగిపోయాడు. కిటికీలోంచి లోపలికి చూశాడు. మంచం మీద కేశవులు జ్వరంతో వణికిపోతూ ఉన్నాడు. అతని భార్య సపర్యలు చేస్తూ 'వచ్చిన కూలి డబ్బులన్నీ పిల్లాడి ఫీజు కోసం ఇచ్చేశావు. మందులు తెద్దామంటే ఇంట్లో రూపాయి కూడా లేదు' అంది. అందుకు కేశవులు 'సమయానికి ఫీజు కట్టకపోతే రఘును పరీక్షలకు అనుమతించరు. నాకు మామూలు జ్వరమేగా వచ్చింది. రేపటికి తగ్గిపోతుందిలే' అన్నాడు మూలుగుతూ.

'అలా అంటే ఎలా? నేను పక్కింటి వాళ్ల దగ్గరకెళ్లి ఓ యాభై రూపాయలు అడిగి మందులు కొని తెస్తాను' అంటూ లేవబోయిన ప్రమీల చేయి పట్టుకుని ఆపి 'నా మాట విను రేపు చూద్దాంలే. ఇప్పుడు అప్పు చేయడం ఎందుకు?' అన్నాడు కేశవులు.

అదంతా చూస్తున్న రఘుకు బాధగా అనిపించింది. తన విలాసాల కోసం ఖర్చు చేసిన ఆ వంద రూపాయలు ఎంత విలువైనవో తెలిసి వచ్చింది. అదీగాక రోజు వారీ కూలికి వెళ్లి డబ్బు సంపాదించే తన తండ్రి శ్రమ విలువను అర్థం చేసుకోలేకపోయానని బాధపడ్డాడు. తన ఫీజు కోసం ఉన్న డబ్బులన్నీ ఇచ్చిన తండ్రి మంచితనాన్ని తలుచుకోగానే దుఃఖం తన్నుకు వచ్చింది. గదిలోకి పరుగున వెళ్లి తండ్రిని అమాంతం కౌగిలించుకున్నాడు. వెక్కివెక్కి ఏడుస్తూ జరిగిన సంగతంతా చెప్పాడు. తన తప్పును క్షమించమని విలపించాడు. వాస్తవాన్ని చెప్పినందుకు రఘును తల్లిదండ్రులు కోపగించుకోలేదు. పైగా 'చూడు రఘూ! నువ్వే మా సర్వస్వం. నీ కోసం, నీ చదువు కోసం ఏమైనా చేస్తాం. నువ్వు మాలా కూలి బతుకు బతక కూడదన్నదే మా కోరిక. జరిగింది మరిచిపో. చేసిన తప్పు తెలుసుకున్నావు కదా. అదే చాలు. ఇక మీదట నీకేం కావాలన్నా సంకోచం లేకుండా మమ్మల్ని అడుగు. మేం తెచ్చిపెడతాం. మళ్లీ ఇలాంటి పొరపాటు చేయకు' అంటూ అక్కున చేర్చుకున్నారు. ఆ ఘటన రఘులో గొప్ప మార్పు తెచ్చింది. ఎప్పుడూ మంచి ప్రవర్తనతో మెలుగుతూ, తన మిత్రుడిలోనూ అలాంటి పరివర్తన తీసుకొచ్చాడు.

- పెండెం జగదీశ్వర్

జవాబులు: ఏది భిన్నం: a చిలిపి ప్రశ్న: [illegible] సరదా పదాలు: 1.వేసవి 2.వేణువు 3.వేగం 4.వేడి 5.వేతనం 6.వేలుపు 7.వేడుక 8.వేకువ

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దేశం పురోగతి

పరిగి, న్యూస్‌టుడే: మాజీ ప్రధాన మంత్రి దివంగత రాజీవ్‌గాంధీ చలవతోనే దేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఎంతగానో పురోగమించిందని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు బి.సుభాష్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు టి.వెంకటేష్ అన్నారు. ఆదివారం రాజీవ్‌గాంధీ జయంతి ఉత్సవాల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడారు. దేశాన్ని శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఎంతో అభివృద్ధి పరిచిన ఘనత ఆయనకే దక్కిందని చెప్పారు. ఆయన హయాంలోనే పంచాయతీలకు నేరుగా జవహర్ రోజ్‌గార్ నిధులు అందాయని తద్వారా గ్రామాల స్వరూపాలు మారిపోయాయని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇ.క్రిష్ణ, ఎ.ఆంజనేయులు, మహిపాల్, అక్బర్, సర్వర్, మహిమూద్, జగన్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: స్పెషల్ ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం కోసం పోలాల అమావాస్యరోజు ఏం చేయాలి? ఇంట్లో పూజించే విగ్రహాల ఎత్తు ఎంత ఉండాలి? 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: ఆమె (శ్రీకాంత్, ఊహ).

మధ్యాహ్నం

12-00: స్పెషల్ అభి'రుచి': ఘుమఘుమలు 'పుదీనా వాంగీబాత్', మీచేతివంట 'మునగాకు జీడిపప్పువేపుడు', 'పాలకూరపచ్చడి', జస్ట్ ఎమినిట్ 'ఉప్మాబోండా' తయారు చేసే విధానం. ఇంటింటి వంటింటి చిట్కాలు.., 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00:వసంతం(డైలీ సీరియల్), 04-30: ఢీ 10 (సుప్రీండాన్స్‌షో) (రిపీట్), 06-00: శ్రీభాగవతం (భక్తిరసాత్మక దృశ్యకావ్యం) (డైలీ సీరియల్), 06-30: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్).

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతి చినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: ఆలీతో సరదాగా: క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీతో..., 10-30: సినీవారం: (స్పెషల్ ప్రోగ్రాం).

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్
మధ్యాహ్నం 12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 మైకేల్ మదన్ కామరాజు రిపీట్
01:15 ది బ్రేకప్ కన్సల్టెంట్ రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్
03:30 హంగామా రిపీట్
సాయంత్రం
04:30 నా షో నా ఇష్టం
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా
రాత్రి
07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 ఈ-జంక్షన్
09:00 పటాస్
09:30 అల్లరే అల్లరి
10:00 సరదాగా కాసేపు
10:30 తారక్ మామా అయ్యోరామ రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

- ★ మానస (ఉ.6:00, సా. 6.00, రా. 11.00)
- ★ డా.ఈటీవీ – (ఉ.6:30, 11:00, మ.3:30, సా.7:30)
- ★ యోగమంత్ర (ఉ.7:00, సా.5:30, రా. 11:30)
- ★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ.7:30, సా.5:00, రా. 10:30)
- ★ అమృతం (ఉ.8:00, మ.12:30, రా. 8:00)
- ★ హెల్దీ & టేస్టీ – (ఉ.8:30, మ.01:00, రా. 8:30)
- ★ ఆరోగ్యమస్తు (ఉ.9:00, మ.03:00, సా. 4:00, రా. 9:00)
- ★ ఆయుష్ (ఉ.9:30)
- ★ లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ (ఉ.10:00)
- ★ అందరికి ఆరోగ్యం (ఉ.10:30)
- ★ విహారి (మ.12:00, సా. 6:30, రా. 10:00)
- ★ హెల్దీ డయాబెటిక్ - (మ.1:30)
- ★ జీవనరేఖ – విమెన్స్ హెల్త్ (మ.2:00, రా. 7:00)
- ★ బాడీ మైండ్ & సోల్– అంతరంగం (మ.2:30, రా. 9:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: బంధీ (కృష్ణంరాజు విజయశాంతి), 10-00: మార్నింగ్ షో: గృహప్రవేశం (ఎల్.వి.ప్రసాద్, భానుమతి), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: సందడే సందడి (జగపతిబాబు, శ్రీకాంత్), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: ఇందు (ప్రభుదేవా, రోజా), రాత్రి: 7-00: ఫస్ట్‌షో: పెద్దక్కయ్య (హరనాథ్, కృష్ణకుమారి), 10-00: సెకండ్‌షో: అసెంబ్లీ గూండా (దేవరాజ్, అరుంధతినాగ్).

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - చికెన్ మసాలా ఇడ్లీ సాండ్విచ్ & హార్స్‌గ్రామ్ ఫ్రైడ్ రైస్, ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో – స్పినాచ్ & చీజ్ స్టఫ్డ్ క్రిప్స్ & తెలగపిండి రవ్వ పులిహోర, ఉ.9:30: వావ్ ఏమి రుచి – అఖిడీ టుకో అప్యక్ & బోహేమనియన్ డ్రెస్సింగ్, ఉ.10.00: పిండివంటలు, ప్రసాదాలు – జీలు & చిలకడదుంప గులాబ్ జామ్, ఉ.11.00: గోరు ముద్దలు – ఆఫ్రికాట్ చికెన్ బ్రౌన్ రైస్, ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ – ఫ్రూటీ ఓట్స్, ఉ.11.30, రా.8:00: బాబాయ్ హోటల్ - పెసరట్టు ఉప్మా & అల్లం పచ్చడి, మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా - సార్సో బాత్ ఇర్షాన్ మచ్ (బెంగాలీ క్యూసైన్), మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ – ఓట్స్ మసాల పూరీ, మ.12.30, రా.8.45: "కౌ అండ్ కాఫ్" సూపర్ చెఫ్ - షీ ఆనియన్ ఎగ్ ఫ్రైడ్ రైస్, మ.12.45, సా.6.15: సూప్స్ & స్టార్టర్స్ - డ్రమ్ స్టిక్ లీఫ్ & హార్స్ గ్రామ్ సూప్, మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి – గ్రిల్డ్ ప్రాన్స్ విత్ యుజు సాస్ (జపాన్ క్యూసైన్), మ.1.30, రా.10.00: చటపట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) - ఆ కాకరకాయ పుల్ల బెల్లం పెట్టిన కూర, మ.1.45, రా.7.30: ట్రెండీ ట్రీట్స్ – ఛాక్లెట్ కప్ కేక్ & ఫిష్ ఫింగర్స్, మ.2.15, రా.10.30: ఛెఫ్స్ స్పెషల్ – బీన్స్ ఉసిలి, మ.2.30, సా.6.00: చోటా షెఫ్ – సాబూదాన చుడ్వా, మ.2.45, రా.10.45: జిల్ – నట్టీ క్యారెట్ స్మూతీ & సిట్రస్ మింట్ ఫిజ్, మ.3.00: ఛాయ్ బిస్కెట్ – కాల్ జోన్స్ & ఛాక్లెట్ ఆల్మండ్ కాఫీ, మ.3.15: సూప్స్ & స్టార్టర్స్ - ఎగ్ డ్రాప్ సూప్.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 °, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతీ, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360 °, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ భోగేశ్వర స్వామి ఆలయం, పామిడి, అనంతపురం జిల్లా, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 °, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 °, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతీ!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360 °, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, కందూరు మహబూబ్‌నగర్ జిల్లా, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 °, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 21-08-2017

SVBC (TTD) — **ఉదయం:** 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణు సహస్రనామ స్తోత్రం, 07-30 శ్రీవారిసేవలు (తోమాలసేవ), 08-00 శతమానం భవతి, 08-30 పూజకు వేళాయే - శివుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీత మాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 పంచభూత లింగాలు, 03-30 విష్ణుపురాణం, **సాయంత్రం:** 04-30 క్షేత్ర దర్శిని, 05-00 లైవ్ ఎస్.డి.సేవ - తిరుమల + ప్రత్యేక వార్తలు, అళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + శివపంచాక్షరి + లింగాష్టకం, 08-00 భక్తిచైతన్యం, 08-30 ధర్మసోపానాలు - శ్రీ చాగంటి, 09-00 ఆలయ దర్శనం - మహారాష్ట్ర, 09-30 దేవిసప్తసతి - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 మహాభారతం - అనుశాసనికపర్వం.

భక్తి TV — **ఉదయం:** 06-00 శ్రీ శివ సహస్రం, 06-30 నమకంచమకం, 07-00 అర్చన, 07-30 శ్రావణలక్ష్మీ నమోస్తుతే, 08-00 పుణ్యక్షేత్రం, 08-30 శ్రావణసోమవార వైభవం (లైవ్), 09-00 సంపూర్ణ రామాయణం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 శివస్తోత్రం, 05-30 శ్రీశివసహస్రం, 06-00 నమకంచమకం, **రాత్రి:** 07-00 భక్తివిశేషాలు, 07-30 అమృతకలశం, 08-00 పరిహారం, 08-30 రామాయణ తరంగిణి, 09-00 లక్ష్మీ కటాక్షం, 09-30 లక్ష్మీ వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తివిశేషాలు.

జీ తెలుగు — **ఉదయం:** 07-30 ఓంకారం, 08-00 సినిమా: కృష్ణ, 11-00 కామెడి ఖిలాడీలు రిపీట్, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్‌రష్, 01-00 బతుకు జట్కాబండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం రిపీట్, 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడి ఖిలాడీలు, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమభాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా.., **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మీ, 08-30 పున్నాగ, 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా: రాక్షసుడు.

మా — **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 రాశి ఫలాలు, 08-30 శ్రీవినాయక చరితం, 09-00 సినిమా: బన్ని, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 కుంకుమపువ్వు, 01-30 బిగ్‌బాస్, 02-30 బిగ్‌బాస్ రిపీట్, **సాయంత్రం:** 04-00 బిగ్‌బాస్ రిపీట్, 05-30 ఒకే జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్‌బాస్, 10-30 బిగ్‌బాస్ రిపీట్.

జెమిని — **ఉదయం:** 06-00 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం రిపీట్, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: రాజాబాబు, **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావు (రిపీట్) 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 నాగిని 2 (రిపీట్), 03-00 సినిమా: రైడ్, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని 2, 08-00 నువ్వునాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు. 10-00 సినిమా: కితకితలు.

HBO — **ఉదయం:** 06-00 ఆల్మోస్ట్ హీరోస్, 07-21 10,000 బీసీ, 09-20 ద గాడ్‌ఫాదర్, **మధ్యాహ్నం:** 12-29 ద హ్యాంగోవర్ పార్ట్-2, 2-15 ట్యాక్సీ 4, **సాయంత్రం:** 04-15 ద డార్క్ నైట్ రైజెస్, **రాత్రి:** 07-16 ఫైనల్ డెస్టినేషన్ 5, 9-00 టీనేజ్ మ్యూటెంట్ నింజ టర్టిల్స్: ఔట్ ఆఫ్ ది షాడోస్, 11-03 పారానార్మల్ యాక్టివిటి 4.

అన్నదాతలో... రేపు ఉదయం 6.30 గం.లకు
1. పత్తిలో గులాబీరంగు పురుగు - సమగ్ర నివారణ
2. దక్షిణ మండలంలో సాగు చేసుకోదగ్గ ప్రత్యామ్నాయ పంటలు
3. డ్రమ్‌సీడర్ యంత్రంతో వరి నాట్లు, కలుపు నివారణ పద్ధతులు
ఉచిత హెల్ప్‌లైన్ నెం.1800-425-4085కు ఉ.10-11 గం.ల మధ్య ఫోన్ చేయవచ్చు.

రైతేరాజు

ఈటీవీ తెలంగాణ జైకిసాన్‌లో... నేటి సాయంత్రం 6.30 గంటలకు
1. పత్తిలో పెరుగుతున్న చీడపీడల ఉధృతి- ఆందోళనలో కరీంనగర్ కర్షకులు
2. రైతులకు దక్కని ఉల్లి గిట్టుబాటు ధర- సామాన్యులకు కన్నీరు తెప్పిస్తున్న ఉల్లిగడ్డ
జైకిసాన్ కార్యక్రమాన్ని www.youtube.com/etv2jaikisan ద్వారా కూడా వీక్షించవచ్చు.

పుదీనా సాగు వివరాలు

పుదీనా సాగు గురించి కంపసాగర్ కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త హారిక సూచించారు. పుదీనా ఔషద మొక్క. దీని ఆకులను ఎక్కువగా వంటలలో సువాసన కోసం సుగంధ ద్రవ్యం గాను వివిధ రకాల పచ్చళ్ల తయారి లోను, సలాడ్‌ల లోను వాడతారు. ఈ మొక్క 40 సె.మీ. ఎత్తు వరకు పెరుగుతుంది. ఆకులు గుండ్రంగా ఆకుల పైభాగం మందంగా ముదురాకుపచ్చ రంగులో ఉంటాయి. ఇందులో మెంథాల్ అనే సుగంధ నూనే చాలా తక్కువ పరిమాణంలో ఉంటుంది. కానీ కార్బోస్ అనే సుగంధ పదార్థం ఎక్కువగా ఉండి సువాసనను, ప్రత్యేకమైన రుచిని కలిగిస్తుంది. పుదీనా ఆకుల కాండం నుండి తీసే నూనెను మెంథాల్ అంటారు. మెంథాల్‌ను ఎక్కువగా ఔషధాల తయారిలో, షేవింగ్, టూత్‌పేస్ట్ తయారిలోను వాడుతుంటారు. మెంథాల్ నూనె శాతం ఆకుల్లో 0.3.నుండి 0.8 వరకు, కాండంలో 0.1 శాతం వరకు ఉంటుంది. అయితే ఈ మెంథాల్ నూనె కోసం సాగు చేసే పుదీనా జాతులు ప్రధానంగా నాలుగు రకాలుంటాయి.

★ జపనీస్ మెంట్, పిప్పర్ మెంట్, స్పేయర్ మెంట్, బెర్గా మెంట్. వీటిలో గుర్తింపు పొందిన



శివాలిక్, హిమాలయ, కోసి, సిక్టమ్ రకాలు మాత్రమే నూనె కోసం సాగు చేస్తారు.

వాతావరణం: ఆకుకూరగా సాగుకు సమశీతోష్ణ, ఉష్ణ ప్రాంతాలు అనువైనవి. ఉష్ణోగ్రత 20-25 డిగ్రీలు ఉంటే ఆకు పెరుగుదల ఉంటుంది. నూనె కోసం అయితే ఎత్తైన చల్లని ప్రాంతాలు సాగుకు అనుకూలం.

నేలలు: సారవంతమైన అధిక సేంద్రియ పదార్థాలు గల తేలికపాటి ఇసుక నేలలు, మురుగునీరు పోయే వసతి గల తేలికపాటి ఒండ్రు నేలలు అనుకూలం నీరు నిలిచే నల్లరేగడి నేలలు పనికిరావు.

విత్తనం: పుదీనాను కాండం ముక్కలు నాటుకోవడం ద్వారా సాగు చేయవచ్చు. 2-3 కణుపులు కలిగిన ముక్కలు ఎన్నుకోవాలి. ఎకరాకు 3-4 క్వింటాళ్ల తీగ ముక్కలు అవసరం అవుతాయి.

విత్తనశుద్ధి: కాండం ముక్కలను లీటర్ నీటికి కార్బండిజమ్ 1 గ్రా. లేదా కాప్టాన్ లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. కలిపిన ద్రావణంలో పది నిమిషాలు ముంచి నాటుకోవడం వల్ల వేరుకుళ్లను అరికట్టవచ్చు.

నాటే విధానం: వరుసల మధ్య 30 లేదా 45 సె.మీ. వరుసల్లో మొక్కల మధ్య 10 సెం.మీ. ఎడంతో 1-2 సెం.మీ. లోతులో ఒక కణుపు తప్పనిసరిగా భూమిలో ఉండేలా నాటాలి.

నాటే సమయం: ఆకుకూర కోసం సంవత్సరం పొడవునా నాటుకోవచ్చు. నూనె కోసం సాగు చేస్తే నవంబర్ 15 నుంచి డిసెంబర్ 15 లోపు నాటుకోవాలి. లేదా నూనె దిగుబడి తగ్గుతుంది.

ఎరువులు: ఆఖరి దుక్కిలో 5 టన్నుల పశువుల ఎరువు, 50 కిలోల నత్రజని, 85 కిలోల భాస్వరం, 15 కిలోల పొటాష్ వేయాలి. నత్రజని 3 దఫాలుగా అనగా ఆఖరి దుక్కిలో సగం, మిగతా సగం 40 రోజులకు, 80-90 రోజులకు వేసుకోవాలి.

–న్యూస్‌టుడే, త్రిపురారం.

పంటమార్పిడి-అంతరపంటలు

ఒకే పంటను ఒకే పొలంలో వరుసగా పండించడం వల్ల చీడపీడల ఉధృతికి అనుకూల పరిస్థితులు ఏర్పడుతాయని, తద్వారా దిగుబడులపై ప్రభావం పడుతుందని కనుక పంటల మార్పిడి పాటించాలని మండల వ్యవసాయ విస్తరణాధికారి శ్యాం సూచించారు. పురుగు జీవిత చక్రం ముగించుకొని హాని కల్గించే స్థితికి చేరుకుంటుంది. ఒక పంటపై ఆశించే పురుగులు మరో పంటను ఆశించడం తక్కువ. పంట మార్పిడి చేస్తే పురుగు జీవితచక్రం ఛేదింపపడుతుంది. అవి వృద్ధి చెందడానికి ప్రతికూల పరిస్థితులు ఏర్పడుతాయి.


కందిలో అంతరపంటగా పెసర

సాధారణంగా పాటించే పంటల సరళి అంతరపంటలు: పప్పుధాన్యపు పంట ఆహారపంట-పప్పుధాన్యపు పైరు, చిరుధాన్యాలు ఆహారపంట-చిక్కుడు జాతి పచ్చిరొట్ట పైరు, వరి-పప్పుధాన్యపు పంట/వేరుశనగ/మొక్కజొన్న, పత్తి-జొన్న/మొక్కజొన్న, పొగాకు-మిరప/కూరగాయలు, చెరకు వరి/వేరుశనగ/కంది/ఆముదం/సజ్జ/జొన్న/

పంట మార్పిడి క్రమం: ఆహార వాణిజ్యపంటలు ఒకసారి, పప్పుజాతి పంటలు మరోసారి మార్పిడి చేయాలి. అవసరమైతే గడ్డిజాతి పైర్లు వేసుకోవాలి. భూసారాన్ని పెంచడానికి పచ్చిరొట్ట పైర్లు వేయాలి. పప్పుజాతి పంటల వేర్ల బుడిపెల్లో రైజోబియం సూక్ష్మజీవులు గాలి లోని నత్రజనిని స్థిరీకరించి మొక్కలకు అందిస్తాయి.

–న్యూస్‌టుడే, ఖానాపురం.